

తాత్సారం!

ఎన్టీఆర్–పీఎంఏవైపై నీలినీడలు

2025-26 ఆర్థిక సంవత్సరం లక్ష్యం 2 లక్షల ఇళ్లు

పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ఎన్టీఆర్-పీఎంఏవైపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ ఏడాది ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఇళ్ల నిర్మాణాల లక్ష్యం రెండు లక్షలుగా నిర్దేశించుకున్న అధికారులు ఇప్పటి వరకు 70 వేల దరఖాస్తులు వస్తే ఒక్కదానికీ అనుమతి ఇవ్వలేదు. పనులు మొదలు పెట్టలేక ఆరు నెలలుగా లబ్ధిదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గృహ నిర్మాణశాఖ ఉన్నతాధికారుల తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు.

- ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి వచ్చిన దరఖాస్తులు 70 వేలు
- ఆరు నెలలైనా మంజూరు కాని జాబితాలు
- పనులు మొదలు పెట్టలేని దైన్యస్థితిలో లబ్ధిదారులు
- 2014-19 నాటి గృహ లబ్ధిదారులకు తప్పని అవస్థలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/గుడ్లవల్లేరు): ఎన్టీఆర్ - పీఎంఏవై(నందమూరి తారక రామారావు- ప్రధాన మంత్రి ఆవాస్ యోజన) ఇళ్లకు మోక్షం కలగటం లేదు. ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వటంలో అంతులేని తాత్సారం జరుగుతోంది. దీంతో ఇళ్లు కట్టుకోలేక ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎన్టీఆర్-పీఎంఏవై గ్రామీణ ఇళ్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవటానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలకు రెండు లక్షల గృహాల వరకు లక్ష్యంగా నిర్దేశించింది. ఇప్పటి వరకు 70 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆరు నెలలు అవుతున్నా ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి మంజూరు రాకపోవడంతో ఈ ఇళ్ల నిర్మాణాల విషయంలో గందరగోళం తలెత్తుతోంది. పీఎంఏవై ఇళ్లకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సాయం రూ.1.80 లక్షలు కాగా, రాష్ట్ర ప్రభుత్వం బీసీ, ఎస్సీ, మైనారిటీలకు రూ.50 వేలు అదనంగా సహాయం చేయాలని నిర్ణయించింది. అంటే మొత్తంగా రూ.2.30 లక్షలు అవుతోంది. అదే ఎస్టీలకు రూ.75 వేలు ఆర్థిక సహాయం అదనంగా చేయాలని ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఈ లెక్కన మొత్తం రూ.2.55 లక్షల సహాయం లబ్ధిదారులకు వస్తుంది. దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా ప్రభుత్వం మంజూరు చేయకపోవటంతో దరఖాస్తుదారుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంటోంది. అనుమతి వస్తే ఇళ్ల నిర్మాణ పనులు మొదలు పెట్టుకోవచ్చని ఎంతోమంది లబ్ధిదారులు భావిస్తున్నారు.



వీరులపాడు మండలంలో నిర్మాణం మొదలు పెట్టి నిలుపుదల చేసిన పీఎంఏవై ఇళ్లు

దశల వారీగా ఫొటోల అప్‌లోడ్‌తో సమస్య

ఇళ్లకు దశల వారీగా అంటే ఇళ్ల గ్రౌండింగ్ పనుల నుంచి పిల్లర్లు, గోడలు, స్లాబ్, పూర్తి చేసే వరకు వివిధ దశల్లో నిర్మాణ స్థాయిని తెలిపేలా ఫొటోలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. జియో ట్యాగింగ్ లేకుండా ఇలా దశల వారీగా చేపట్టే పనులను ఫొటోలు తీయటం సాధ్యం కాదు. లబ్ధిదారులు ఇళ్లు కట్టుకుంటే మొదటికే మోసం వచ్చే పరిస్థితి ఏర్పడుతుందన్న ఉద్దేశ్యంతో మంజూరు వచ్చి, జియో ట్యాగింగ్ చేసే వరకు ఇళ్లు కట్టుకోవద్దని హౌసింగ్ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ఇళ్ల పనులు మొదలు పెట్టిన వారంతా ఎక్కడికక్కడ పనులు నిలుపుదల చేశారు. గతంలో కూడా ఈ విధానం అమల్లో ఉన్నా.. హౌసింగ్ అధికారులు ఆయా స్టేజ్‌లలో ఫొటోలు తీసుకునేవారు. మంజూరు ఆర్డర్ వచ్చిన తర్వాత నిర్ణీత క్రమంలో దశల వారీగా వాటిని అప్‌లోడ్ చేసి బిల్లులు పెట్టేవారు. ప్రస్తుతం ఈ విధానం మిగతా 6లో..

గతంలో దరఖాస్తు చేసిన వెంటనే పనులు

పీఎంఏవై ఇళ్ల కోసం గతంలో ప్రజలు దరఖాస్తులు చేసిన తర్వాత హౌసింగ్ శాఖ పరిధిలో వారి అర్హతలను నిర్ణయించి అర్హులైన వారిని ఆన్‌లైన్ చేసేవారు. దీని ప్రకారం వారికి మంజూరు వచ్చినా.. రాకపోయినా.. ముందు ఇళ్ల పనులు మొదలు పెట్టుకోమని చెప్పేవారు. దీంతో లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించేవారు. తర్వాత మంజూరు వచ్చినపుడు ఆ ఇళ్ల నిర్మాణ పనులు ఏ దశలో ఉన్నాయో హౌసింగ్ అధికారులు పరిశీలించి దానికి తగినట్టుగా బిల్లులు విడుదల చేసేవారు.

నేడు జియో ట్యాగింగ్ చేస్తేనే పనులు

రాష్ట్ర ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి నిబంధనలు మార్చింది. లబ్ధిదారులందరినీ ఖచ్చితంగా జియో ట్యాగింగ్ చేయాల్సి ఉంటుంది. జియో ట్యాగింగ్ చేయాలంటే ప్రభుత్వం మంజూరు ఇవ్వాల్సి ఉంటుంది. అనుమతి రాకుండా జియో ట్యాగింగ్ చేయటం సాధ్యం కాదు. దీంతో ఇళ్ల పనులు ప్రారంభించమని అర్హులైన లబ్ధిదారులకు హౌసింగ్ అధికారులు చెప్పట్లేదు.



నిదీష్

బిడ్డ.. నువ్వు ఎక్కడ!

నిదీష్ అదృశ్యమై నెల రోజులు

గత నెల 12న రొయ్యూరులో అమ్మమ్మ ఇంటికొచ్చి మాయమైన బాలుడు

- నెల రోజులుగా పోలీసులు గాలిస్తున్నా లభించని ఆచూకీ
- జాడ తెలియక కుమిలిపోతున్న నిమ్మకూరు సర్పంచ్ దంపతులు
- మిస్టరీగా చిన్నారి అదృశ్యం వ్యవహారం

అమ్మమ్మ, తాతయ్యలను చూసొద్దామని చెల్లితో కలిసి వెళ్లిన పదేళ్ల బాలుడు రొయ్యూరులో ఆడుకుంటూ అదృశ్యమయ్యాడు. పోలీసులు నెల రోజులుగా వెతుకుతున్నా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో బిడ్డ.. నువ్వు ఎక్కడ ఉన్నావ్ అంటూ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. నిదీష్ రాక కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. చిన్నారి మిస్టరీ వ్యవహారం పోలీసులకు సవాల్‌గా మారింది.




నిదీష్ చిత్రపటంతో తల్లి సరోజిని

తోట్లవల్లూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పామర్రు మండలం నిమ్మకూరు గ్రామ సర్పంచ్ పడమట దుర్గా శ్రీనివాసరావు కుమారుడు నిదీష్(10) తోట్లవల్లూరు మండలం రొయ్యూరులో అదృశ్యమై నెల రోజులు గడిచింది. ఆ రోజు నుంచి పోలీసులు, కుటుంబసభ్యులు ఎంత గాలించినా నేటికీ చిన్నపాటి క్లూ కూడా లభించకపోవటం మిస్టరీగా మారింది. గత జూలై 12వ తేదీన నిమ్మకూరు నుంచి నిదీష్‌ను, అతని చెల్లిని మేనమామ వీరంకి బాలకృష్ణ ద్విచక్ర వాహనంపై మిగతా 6లో..

ప్రకాశం బ్యారేజీకి మళ్లీ వరద!

ఎగువ నుంచి పులిచింతలకు 2.50 లక్షల క్యూసెక్కుల రాక

- పులిచింతల నుంచి కృష్ణానదికి భారీగా రానున్న వరద
- అప్రమత్తమైన అధికారులు.. గేట్లు ఎత్తేందుకు సిద్ధం



విజయవాడ సిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజీకి ఎగువ నుంచి మళ్లీ భారీ వరద రానుంది. దీనిపై ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు. బ్యారేజీ గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసేందుకు సిద్ధమయ్యారు. ఎగువన నాగార్జున సాగర్ నుంచి, హైదరాబాద్‌లోని మూసీ నది నుంచి పులిచింతల ప్రాజెక్టుకు బుధవారం 2.50 లక్షల క్యూసెక్కుల నీరు చేరుతుందని అధికారులు చెబుతున్నారు. మరో వైపు ఖమ్మం, వరంగల్ ప్రాంతాల నుంచి వైరా, కట్టలేరు, మునేరు వాగుల ద్వారా వరద నీరు నేరుగా కృష్ణానదిలో చేరనుంది. క్రమక్రమంగా వరద ఉధృతి మూడు లక్షల క్యూసెక్కులకు చేరే అవకాశం ఉందని వెల్లడిస్తున్నారు. పులిచింతల నుంచి వరద నీరు బుధవారం సాయంత్రానికి ప్రకాశం బ్యారేజీకి చేరుతుందని, ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి, గురువారం ఉదయం మూడు లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నామని కృష్ణా రివర్ కన్సర్వేటివ్ ఈఈ రావెళ్ల రవికిరణ్ మంగళవారం మిగతా 6లో..



స్వామిత్వ తలపోటు!

నెలాఖరులోపు ఇళ్ల సర్వే పూర్తి చేయాలని డెడ్‌లైన్



చిన్నాపురం పంచాయతీ

జూమ్ మీటింగ్‌లో ఆదేశాలు ఇచ్చిన డీపీవో

- సర్వేయరు, వీఆర్వోలు, డ్రోన్లు లేకుండా జరపాలని సూచన
- తలలు పట్టుకుంటున్న పంచాయతీ కార్యదర్శులు
- టేపుతో కొలిచి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడం తమ వల్లకాదని ఆవేదన

పంచాయతీ కార్యదర్శులకు స్వామిత్వ సర్వే పెద్ద తలపోటుగా మారింది. నెలాఖరులోపు ఇంటింటికి వెళ్లి టేపుతో కొలిచి సర్వే వివరాలు స్వామిత్వ పోర్టల్‌లో నమోదు చేయాలని డీపీవో కార్యాలయం నుంచి ఆదేశాలు రావడంతో కార్యదర్శులు ఆందోళన చెందుతున్నారు. సర్వేయరు, వీఆర్వోలు, డ్రోన్లు లేకుండా ఎలా జరపాలని తలలు పట్టుకుంటున్నారు. గతంలో నలుగురైదుగురు సిబ్బంది యంత్రాల సాయంతో చేస్తేనే అవ్వని పని ఇప్పుడు తక్కువ సమయంలో ఇద్దరు వ్యక్తులు ఎలా చేస్తారని ప్రశ్నిస్తున్నారు. మరింత మంది, సిబ్బంది, యంత్రాలు, గడువు కావాలని కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు, ఈవోలపై స్వామిత్వ(సర్వే ఆఫ్ విలేజ్ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రొవైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియాస్)సర్వే కత్తి వేలాడుతోంది. గ్రామ పంచాయతీల్లో గృహాల సర్వేను ఖచ్చితత్వంతో పూర్తి చేసి స్వామిత్వ పోర్టల్‌లో నమోదు చేసి, సంబంధిత ఇంటి యజమాని పేరుతో భూమి హక్కు పత్రం ఇచ్చే వెసులుబాటు కోసం ఓ బృహత్తర కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గతంలో మండలంలో ఒకటి లేదా రెండు పంచాయతీలను ఎంపిక చేసి ప్రయోగాత్మకంగా ఈ సర్వేను పూర్తి చేసేవారు. సర్వే చేసే సమయంలో గ్రామ వీఆర్వో, సర్వేయర్, పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్‌లు దగ్గరుండేవారు. సర్వే ప్రక్రియను తక్కువ సమయంలో ఖచ్చితత్వంతో నిర్వహించేందుకు రోవర్‌లు, డ్రోన్‌లను కూడా ఉపయోగించేవారు. యంత్రాల ద్వారా చేసిన సర్వేను ఆధారంగా చేసుకుని ఇంటి యజమానులు, గృహాల సరిహద్దులను స్వామిత్వ పోర్టల్‌లో నమోదు చేసేవారు. ఈ పద్ధతిలో జరిగిన సర్వేపై ఎలాంటి అభ్యంతరాలు, ఇబ్బందులు రాలేదని పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు.

రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్‌లు లేకుండా ఎలా?

గ్రామాల్లో ఇళ్లు సర్వే చేయాలంటే ఆయా గృహాలు ఏయే సర్వే నెంబర్లలో ఉన్నాయో రెవెన్యూ సిబ్బందికి, సర్వేయర్లకు మాత్రమే తెలుస్తుంది. దీంతో పాటు సర్వే చేసే సమయంలో వీఆర్వోలు సర్వే నెంబర్లను నిర్ధారిస్తే సర్వేయర్‌లు గృహాలకు కొలతలు వేసి, ఇల్లు ఎంత విస్తీర్ణంలో ఉంది, ఇంటి చుట్టూ ఖాళీస్థలం ఎంత ఉంది అనేది నిర్ధారిస్తారు. వీఆర్వో, సర్వేయర్, పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్‌లు అందరూ కలసి పనిచేస్తే ఒక రోజుకు 20 గృహాలలోపు సర్వే పూర్తి చేయగలిగామని చెబుతున్నారు. ఇప్పుడు వీఆర్వో, సర్వేయర్, డిజిటల్ అసిస్టెంట్‌లు, రోవర్‌లు, డ్రోన్‌లు లేకుండా కేవలం పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ మిగతా 6లో..

డీఎస్సీలో సత్తాచాటారు

ఫలితాలు విడుదల చేసిన ప్రభుత్వం

విజయవాడకు చెందిన కె.వి.దుర్గాభవానికి స్టేట్ ర్యాంకు

- ఉమ్మడి కృష్ణాజిల్లాలో 1,208 పోస్టులు
- పరీక్షలు రాసిన 67,470 మంది అభ్యర్థులు

విజయవాడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రాత్రి విడుదల చేసిన డీఎస్సీ పరీక్ష ఫలితాల్లో జిల్లా అభ్యర్థులు సత్తాచాటారు. నగరానికి చెందిన కె.వి.దుర్గాభవానికి స్టేట్ ర్యాంకు సాధించారు. అభ్యర్థుల స్కోరు కార్డులు వారి లాగిన్‌లోకి వచ్చాయి. అత్యధిక మార్కులు సాధించిన అభ్యర్థులతో పాటు మార్కుల పరంగా తమకు కచ్చితంగా ఉద్యోగం వస్తుందన్న నమ్మకంతో ఉన్న అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తం 1,208 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉండగా, 67,470 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు. జిల్లా పరిషత్, ఎంపీపీ, మున్సిపల్ పాఠశాలలన్నింటిలో కలిపి స్కూల్ అసిస్టెంట్స్(ఎస్ఏ) 663, సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్‌జీటీ) 545 పోస్టులున్నాయి. వీటితో పాటు ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ఐదు ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీలో భర్తీ చేయబోతున్నట్టు జిల్లా నోడల్ ఆఫీసర్ తెలిపారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన పలువురు అభ్యర్థులను 'ఆంధ్రజ్యోతి' పలకరించింది.

ఐదేళ్లుగా ఎదురుచూస్తున్న ఆనందం



ఐదేళ్లుగా డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నా. ఈ ఏడాది విడుదల చేయడం.. 94.39 మార్కులతో స్టేట్ ర్యాంక్ సాధించడం ఆనందంగా ఉంది. 2022లో రైల్వేలో గ్రూపు-డీ పోస్టు వచ్చింది. అదే సమయంలో టెట్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఉపాధ్యాయ వృత్తిపై ఉన్న ఇష్టంతో అందులో చేరలేదు. డీఎస్సీ నోటిఫికేషన్ కూడా ఇస్తారనుకుంటే ఇవ్వలేదు. సమయం వృథా అయినా మంచి ర్యాంకు సాధించా. నాది మధ్యతరగతి కుటుంబం. నాన్న దుర్గారావు తాపీమేస్త్రి, అమ్మ ఇంటివద్దే ఉంటుంది. వారి సహకారంతోనే మంచి ర్యాంకు సాధించా. పోస్టులు కూడా తొందరగా భర్తీ చేస్తారని భావిస్తున్నా. - కె.వి.దుర్గాభవాని, కృష్ణలంక

నిరంతర సాధనతో విజయం



2019లో డీఈడీ, 2022లో బీఈడీ పూర్తిచేశా. డీఎస్సీలో 91.31 మార్కులతో మంచి ర్యాంకు సాధించా. ఎస్‌జీటీ పేపర్-1, స్కూల్ అసిస్టెంట్ బయాలజీ, టీజీటీ-రెసిడెన్సియల్ పోస్టులకు అర్హత సాధించా. ఈ మూడింటిలో ఏది మంచిదనిపిస్తే అటువైపు మొగ్గుచూపుతా. ఐదేళ్లుగా ఎదురుచూస్తున్నా. నిరంతర సాధనతోనే విజయం సాధించా. తల్లిదండ్రుల ప్రోత్సాహం మరువలేనిది. - వై.నాగసాయి వైదేహి, గుణదల

పట్టుదలతో సాధించా



డీఎస్సీ కోసం ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్నా. 2018లో నోటిఫికేషన్ ఇచ్చినా ఉద్యోగం పొందలేకపోయా. ఈ సారి ఎలాగైనా సాధించాలనే పట్టుదలతో సాధన చేశా. 83.9 మార్కులు రావడం ఆనందంగా ఉంది. 2023లో కొంతకాలం సాఫ్ట్‌వేర్‌లో ట్రైనింగ్ తీసుకుని ఉద్యోగం చేశా. నాన్న బాలస్వామి ప్రైవేటు కంపెనీలో ఉద్యోగి, తల్లి రమాదేవి గృహిణి. వారి తోడ్పాటుతోనే మెరుగైన ఫలితాలు సాధించా. - పి.శ్రీవల్లి, పెద్దఅవుటుపల్లి



మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి అవనిగడ్డ సెంటర్లో జలమయమైన రోడ్లు 6

జిల్లాలో భారీ వర్షం

- దివిసీమలో కుండపోత
- లోతట్టు ప్రాంతాలు జలమయం

మచిలీపట్నం, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. కోడూరు, నాగాయలంక, అవనిగడ్డ, చల్లపల్లి, మోపిదేవి, ఘంటసాల మండలాల్లో రెండు గంటలకు పైగా కుండపోతగా వర్షం పడింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వాతావరణంలో ఏర్పడుతున్న మార్పుల నేపథ్యంలో కోస్తాతీరం వెంబడి బుధ, గురువారాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ మంగళవారం హెచ్చరికలు జారీ చేసింది. మంగళవారం సాయంత్రం నుంచి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఒకమోస్తరు వర్షం కురిసింది. బలమైన గాలులు వీచాయి. జిల్లాలో 2.50లక్షల ఎకరాల్లో ఇప్పటివరకు వరినాట్లు పూర్తయ్యాయి. వర్షాలు పైరుకు మేలు చేస్తాయి.

అన్నదాతల ఆగ్రహావేశాలు

- అరకొరగా యూరియా సరఫరా



నార్తువల్లూరు పీఏసీఎస్ వద్ద యూరియా కోసం తోసుకుంటున్న అన్నదాతలు 8



పాయకాపురం రైతుబజార్.. ఈవో కిరణ్ రాసిన రాజీనామా లేఖ

రైతుబజార్లలో రాజీనామాల ప్రకంపనలు!

- పటమట, పాయకాపురం ఈవోల రాజీనామా
- వ్యక్తిగత కారణాలే అంటున్న అధికారులు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

విజయవాడలో రెండు రైతుబజార్ల ఎస్టేట్ ఆఫీసర్లు ఉద్యోగాలకు రాజీనామా చేశారు. రాజీనామా లేఖలను సీఈవో కె.మాధవీలతకు, జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియా, మార్కెటింగ్ శాఖ ఏడీ రాజాబాబుకు అందజేశారు. ఈనెల 7న జరిగిన ఈ పరిణామం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తూర్పు నియోజకవర్గంలో పటమట రైతుబజార్ ఈవో రమేష్, సెంట్రల్ నియోజకవర్గం పాయకాపురంలోని మోడల్ రైతుబజార్ ఈవో పి.ఉదయ్‌కిరణ్ మూర్తి ఉద్యోగాలకు రాజీనామా చేశారు. ఇప్పుడిది మార్కెటింగ్ శాఖలో ప్రకంపనలు రేపుతోంది. వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేస్తున్నామని వారు లేఖల్లో పేర్కొన్నా.. దీని వెనుక వేరే కారణాలు ఉన్నాయని తెలుస్తోంది.

రాజకీయ ఒత్తిళ్లే కారణమా?

ఎస్టేట్ ఆఫీసర్లు కిరణ్, రమేష్ రాజీనామా చేసిన విషయం బయటకు వచ్చిన తర్వాత పలువురు సన్నిహితులు వారితో మాట్లాడారు. ఏం జరిగిందని ఆరా తీయగా.. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసినట్టు చెప్పుకొచ్చారు. అసలు కారణాలు ఇప్పట్లో చెప్పలేమని వారు కొంతమందితో అన్నట్టు తెలిసింది. పాయకాపురం మోడల్ రైతు బజార్ ఈవోగా వ్యవహరిస్తున్న కిరణ్‌ను బదిలీచేసి కొత్త ఈవోను నియమించాలని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు రైతుబజార్ల సీఈవోకు లేఖ రాసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఉల్లి, పచ్చిమిర్చి హోల్‌సేల్ వ్యాపారం చేసే ఇద్దరు నేతలు రైత్వారీ దుకాణం రెన్యూవల్‌కు ఇక్కడ భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలున్నాయి. రైతుబజార్‌కు సెక్యూరిటీగార్డుగా ఇటీవల ఓ వ్యక్తిని కిరణ్ నియమించారు. ఈ పోస్టునకు మరో వ్యక్తిని ఓ ప్రజాప్రతినిధి సిఫార్సు చేశారు. దీనిని కిరణ్ పరిగణనలోకి తీసుకోలేదని తెలిసింది. ఇది ఆయనకు ఒకింత ఆగ్రహాన్ని కలిగించినట్టు సమాచారం. కొద్దినెలల క్రితం ఇక్కడి రైతుబజార్‌లో పాల ఉత్పత్తుల స్టాల్, కవర్ల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ రెండు తన దృష్టిలో లేకుండా ఎలా ఏర్పాటు చేస్తారని బొండా ఉమామహేశ్వరరావు అసంతృప్తిని వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఇది కాకుండా కూటమిలో ఉన్న మూడు పార్టీల నేతలు తమ అనుచరులకు మేలు చేయడానికి రైతుబజార్‌లో కొత్త దుకాణాలను కేటాయించాలని ఒత్తిడి చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఒత్తిళ్లు తట్టుకోలేక కిరణ్ రాజీనామా చేసినట్టు ప్రచారం జరుగుతోంది. పటమట ఈవో రమేష్ రాజీనామా విషయం మాత్రం తెలియడం లేదు. దుకాణాల కేటాయింపు విషయంలో మూడు పార్టీల నుంచి సిఫార్సులు భరించలేక రమేష్ ఒత్తిడికి లోనైనట్టు తెలుస్తోంది. ప్రభుత్వాలు మారగానే పార్టీల నేతల కళ్లు ముందుగా రైతుబజార్లపై పడుతున్నాయి. ఏదో ఒకవిధంగా దుకాణాలు పొందడానికి పైరవీలు చేస్తున్నారు. దీంతో ఈవోలు ఇబ్బందులు పడుతున్నారని సమాచారం. కిరణ్, రమేష్ రాజీనామా లేఖలను తీసుకున్న రైతుబజార్ల సీఈవో కె.మాధవీలత మరోసారి పునరాలోచన చేసుకోవాలని సూచించినట్టు విశ్వసనీయంగా తెలిసింది.



చల్లపల్లిలో భారీ వర్షానికి జలమయమైన రోడ్లు

దివిసీమలో కుండపోత వర్షం

- రహదారులు జలమయం, విరిగిపడిన చెట్లు, విద్యుత్ సరఫరాకు అంతరాయం

అవనిగడ్డ - చల్లపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఆకాశానికి చిల్లుపడిందా అన్నట్టుగా దివిసీమలో మంగళవారం రాత్రి కుండపోత వర్షం జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. కోడూరు, నాగాయలంక, అవనిగడ్డ, చల్లపల్లి, మోపిదేవి, ఘంటసాల మండలాల్లో రాత్రి ఏడు గంటల సమయం దాటిన తర్వాత వర్షం కురవటం ప్రారంభమై మధ్యలో కొద్దిసేపు విరామం ఇచ్చి ఆ తర్వాత రెండు గంటలకు పైగా కుండపోతగా వర్షం కురిసింది. రహదారులన్నీ వర్షపునీటితో నిండిపోయాయి. రహదారులు కాల్వలను తలపించాయి. కుండపోత వర్షానికి తోడు గాలులు సైతం వీయటంతో పలు ప్రాంతాల్లో రోడ్లవెంబడి చెట్లు నేలకూలాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరించినప్పటికీ చల్లపల్లి మండలంలో చెట్లు విరిగిపడటంతో మరమ్మతులకు శ్రమించాల్సి వచ్చింది.

స్వామిత్వ తలపోటు!

(5వ పేజీ తరువాయి)

అసిస్టెంట్‌లు ఇంటింటికీ వెళ్లి, ఇంటి కొలతలను టేపుతో కొలిచి రోజుకు 150 గృహాల సర్వేను పూర్తి చేయాలని సోమవారం నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో డీపీవో ఆదేశించటంతో పంచాయతీ కార్యదర్శులు ఖంగుతిన్నారు. గతంలో నలుగురైదుగురు సిబ్బంది యంత్రాల సాయంతో సర్వే చేస్తేనే రోజుకు 20 ఇళ్లు అవ్వలేదని, ఇప్పుడు అవేమీ లేకుండా ఇద్దరే ఈ పని చేయాలని చెప్పడం ఎంతవరకు సమంజసమని పంచాయతీ కార్యదర్శులు ప్రశ్నిస్తున్నారు.

మూడు, నాలుగు నెలలు పడుతుంది!

జిల్లాలో 474 పంచాయతీలు ఉన్నాయి. వీటిలో 100కుపైగా అధిక జనాభా, గృహాలు ఉన్న పంచాయతీలు ఉన్నాయి. ప్రతి ఇంటికి వెళ్లి కొలతలు తీసుకుని, వాటిని రాసుకుని, మళ్లీ స్వమిత్వ పోర్టల్‌లో పూర్తి వివరాలు నమోదు చేయడానికి కనీసంగా మూడు నుంచి నాలుగు నెలల సమయం పడుతుందని పంచాయతీ కార్యదర్శులు అంటున్నారు. చిన్న పంచాయతీల్లో రెండు నెలల వ్యవధిలో ఈ పనిపూర్తి చేసినా, పెద్ద పంచాయతీలలో కనీసంగా నాలుగు నెలల సమయం పడుతుందని పేర్కొంటున్నారు. కానీ ఆగస్టు నెలాఖరులోపుగా ఈ ప్రక్రియను పూర్తిచేయాలని అధికారులు చెబుతున్నారని పంచాయతీ కార్యదర్శులు, ఈవోలు వాపోతున్నారు. హడావుడిగా ఈ పనిని పూర్తి చేస్తే తప్పులు దొర్లడం ఖాయమని, మళ్లీ సర్వే చేయాల్సి వస్తుందని చెబుతున్నారు. ఈ సర్వే పూర్తయిన తర్వాత ఇంటి యజమానుల పేరున భూమి హక్కు పత్రాలు ఇస్తారని, వీటి ద్వారా ఇంటిస్థలం రిజిస్ట్రేషన్ సులువుగా చేయించుకునే వెసులుబాటు వస్తుందని అంటున్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన సర్వేను హడావుడిగా చేయాలని ఆదేశాలు జారీ చేస్తుండటంతో ఏం చేయాలో తమకు పాలుపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ, సర్వే విభాగం సిబ్బంది సమన్వయంతో పనిచేసేలా అవకాశం కల్పించి, సర్వే యంత్రాలను కూడా సమకూరిస్తే ఈప్రక్రియ వేగవంతంగా, ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా పూర్తి చేయగలుగుతామని అంటున్నారు. స్వమిత్వ సర్వేకు కొంతసమయం ఇవ్వాలని కోరుతున్నారు.

కర్రకు గిరాకీ!

- టన్ను రూ 6వేలు పలుకుతున్న సుబాబుల్
- గత వైసీపీ ప్రభుత్వంలో రైతుల నిలువుదోపిడీ
- ప్రస్తుతం డిమాండ్ పెరగడంతో గిట్టుబాటు ధర

జిల్లాలో సుబాబుల్ కర్ర రికార్డుస్థాయిలో ధర పలుకుతోంది. పేపరు కంపెనీల డిమాండ్‌కు తగినంతగా కర్ర సరఫరా లేనందున ధర బాగా పెరిగింది. ఖర్చులతో సంబంధం లేకుండా టన్నుకు నికరంగా రైతు చేతికి రూ.6వేలు అందుతున్నాయి. మెట్ట ప్రాంతంలో వాణిజ్య పంటలతో నష్టపోతున్న రైతులు, కర్రకు మంచి ధర లభిస్తుండటంతో ప్రత్యామ్నాయంగా సుబాబుల్ తోటల వైపు మొగ్గుచూపుతున్నారు. దీంతో ఈ ఏడాది సుబాబుల్ తోటల విస్తీర్ణం గణనీయంగా పెరిగింది.





సుబాబుల్ కర్ర నరుకుతున్న కూలీలు, ట్రాక్టరుకు లోడింగ్

(కంచికచర్ల - ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ పాలనలో సుబాబుల్ రైతులు నిలువు దోపిడీకి గురయ్యారు. మద్దతు ధరలో కనీసం నామ మాత్రపు ధర కూడా రైతులకు అందలేదు. పదేళ్ల క్రితం నాటి టీడీపీ ప్రభుత్వం సుబాబుల్ కర్రకు టన్ను రూ.4,400 మద్దతు ధర నిర్ణయించింది. కర్ర నరుకుడు, రవాణా, ఇతరత్రా ఖర్చులు కలిపి టన్నుకు రూ. వెయ్యి వరకు ఖర్చులు పోను చేతికి నికరంగా రూ. 3,400 తగ్గకుండా అందాయి. అలాంటిది వైసీపీ ప్రభుత్వ హయాంలో టన్నుకు రూ.1,500 కూడా గగనమైంది. ఐదేళ్లపాటు గిట్టుబాటు ధర ఇవ్వకుండా పేపరు కంపెనీలు, రైతులను పీల్చి పిప్పి చేశాయి. 2019 ఎన్నికలకు ముందు రూ. 5వేలకు తగ్గకుండా ధర ఇస్తామని వాగ్దానాలు చేసిన వైసీపీ నేతలు, అధికారంలోకి రాగానే కనీసం పట్టించుకోక, గిట్టుబాటు ధర ఇప్పించటంలో పూర్తిగా విఫలమయ్యారు. గిట్టుబాటు ధర కోసం రైతుల ఆందోళన అరణ్యరోదనగా మారింది. తీవ్రంగా నష్టపోయిన పలువురు రైతులు తోటలను తొలగించారు.

2014 నుంచి ధరలో వ్యత్యాసం..

2014 ఎన్నికల ముందు నుంచి సుబాబుల్ ధరలో కదలిక వచ్చింది. క్రమేణా ధర పుంజుకుంది. గత ఆగస్టులో రైతుల చేతికి నికరంగా రూ. 6వేలు అందాయి. తర్వాత ధర కొద్దిగా దిగజారింది. ఒక దశలో రూ. 5 వేలు మాత్రమే దక్కాయి. తిరిగి మార్కెట్లో ధర పెరుగుతోంది. పేపరు కంపెనీల అవసరాల (డిమాండ్)కు తగినంతగా ముడిపదార్థమైన సుబాబుల్ కర్ర దొరకటం (సరఫరా)లేదని రైతు నేతలు చెపుతున్నారు. ఒకవైపు తోటల విస్తీర్ణం తగ్గటం, మరోవైపు వర్షాకాలం కావటం వల్ల తోటలు నరకటానికి వీలుపడటం లేదు. ప్రస్తుతం కర్ర సరఫరా బాగా తగ్గింది. గుత్తాధిపత్యంతో ధర విషయంలో పెత్తనం చెలాయించిన కంపెనీలు కర్ర కోసం పోటీపడుతూ ధర పెంచుతున్నాయి. రైతు చేతికి నికరంగా రూ. 6వేలు అందడం సుబాబుల్ చరిత్రలో ఓ రికార్డు. కూటమి ప్రభుత్వంలో అత్యధిక ధర లభిస్తుండటంతో రైతులు సంతోషంతో ఉన్నారు. ఈ ధర ఇంకా పెరగవచ్చని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు

ఈ ప్రాంతం నుంచి సుబాబుల్ కర్ర ఎస్‌పీఎం (సిర్పూర్ కాగజ్ నగర్), జేకే పేపర్ మిల్స్ (బలార్షా), ఏపీపీఎం (రాజమండ్రి), ఐటీసీ (భద్రాచలం) తదితర పేపరు మిల్లులకు సరఫరా అవుతుంది. వ్యవసాయ మార్కెట్ కమిటీల పర్యవేక్షణ లేనందున దాదాపుగా పేపరు కంపెనీలన్నీ దళారుల ద్వారా కర్ర కొనుగోలు చేస్తుండటం విశేషం. కొందరు దళారులు ఎకరాల వంతున తోటలను కాంట్రాక్టుకు తీసుకుంటున్నారు. ఇంకొందరు తోటల్లో కర్ర నరుకుడు, రవాణా ఖర్చులతో సంబంధం లేకుండా టన్ను రూ. 6వేల వంతున రైతుకు ఇస్తున్నారు.

పెరిగిన తోటల విస్తీర్ణం

ఈ ఏడాది సుబాబుల్ తోటల విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. జిల్లాలో నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో సుబాబుల్ తోటలు ఉన్నాయి. గతంలో లక్ష ఎకరాల్లో తోటలు ఉంటే.. గిట్టుబాటు ధర లభించక అధికశాతం రైతులు తోటలను తొలగించటంతో విస్తీర్ణం 50 వేల ఎకరాలకు తగ్గింది. ఒకవైపు వాణిజ్య పంటలు, అపరాల వల్ల నష్టపోతుండటం, మరోవైపు కర్రకు రికార్డుస్థాయిలో ధర లభిస్తుండటంతో రైతులు సుబాబుల్ తోటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. మరల తోటల విస్తీర్ణ లక్ష ఎకరాలకు చేరుతుందని చెపుతున్నారు. అయితే ఎకరం తోటలో 25 నుంచి 35 టన్నుల లోపు కర్ర దిగుబడి వస్తుంది. మూడు నుంచి నాలుగేళ్లలోపు తోట నరుకుడుకు వస్తుంది. ఏడాది నుంచి తోటల విస్తీర్ణం పెరుగుతున్నందున రెండేళ్ల తర్వాత కర్ర పుష్కలంగా లభ్యం కానున్నది.

బైక్‌ను ఢీకొన్న ట్యాంకర్

- తల్లి మృతి.. కుమారుడికి స్వల్పగాయాలు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మరి కాసేపట్లో ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులతో సంతోషంగా గడిపేద్దామనుకున్న ఆ కుటుంబాన్ని మృత్యువు బూడిద ట్యాంకర్ రూపంలో వెంటాడింది. ద్విచక్రవాహనంపై వెళుతున్న తల్లీకొడుకును వెనుక నుంచి ట్యాంకర్ వేగంగా ఢీకొనడంతో తల్లి అక్కడికక్కడే మృతిచెందగా.. కుమారుడికి స్వల్పగాయాలయ్యాయి. ఈ విషాదకర ఘటన ఇబ్రహీంపట్నంలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కొండపల్లికి చెందిన పరగటి విజయమ్మ కుమారుడితో కలిసి విజయవాడ వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నారు. వీరి వాహనం వేడి నీళ్ల కాలువ వంతెనపైకి చేరుకుటుండగా వెనుక నుంచి బూడిద ట్యాంకర్ ఢీ కొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న విజయమ్మ (45) అక్కడికక్కడే మృతి చెందింది. హెల్మెట్ ధరించి ఉన్న ప్రవీణ్ గాయాలతో బయటపడ్డాడు. ట్యాంకర్ ఆగకుండా వెళ్లడాన్ని గుర్తించిన కొందరు రింగ్‌లో ఉన్న ట్రాఫిక్ ఎస్ఐ బి.లక్ష్మణరావుకు సమాచారం ఇవ్వడంతో వారు ట్యాంకర్‌ను ఛేజ్ చేసి నిమ్రా కళాశాల వద్ద పట్టుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తల్లి మృతదేహం వద్ద విషాద వదనంతో..

ఆక్వా రైతును ఆదుకోండి

- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్
- దశలవారీ ఆందోళనకు తీర్మానం

గవర్నర్‌పేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఆక్వా రైతును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వేస్తున్న పన్నులు, ఆక్వా రైతుపై ప్రభావం అంశంపై ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో ఎంజీరోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో సోమవారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఆక్వా రైతును ఆదుకునేలా ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు దశలవారీ ఆందోళనలు చేయాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశానికి సంఘం రాష్ట్రఅధ్యక్షుడు వి.కృష్ణయ్య అధ్యక్షత వహించారు. పూర్వ అధ్యక్షుడు బి.బలరామ్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని 8 జిల్లాల్లో 4 లక్షల ఎకరాలకు పైగా భూముల్లో రొయ్యలసాగు జరుగుతోందన్నారు. భారత్ నుంచి ఇతర దేశాలకు 7.16 లక్షల టన్నుల ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయని, ఇలాంటి స్థితిలో ట్రంప్ ఆక్వా ఎగుమతులపై సుంకాన్ని 50 శాతానికి పెంచడంతో దీని ప్రభావం ఏపీపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుందన్నారు. సంఘ అధ్యక్షుడు వి.కృష్ణయ్య మాట్లాడుతూ, ట్రంప్ ప్రకటనతో రొయ్యల ధరలు పడిపోయాయని, అమెరికా సుంకాలతో ఇతర దేశాలకు ఎగుమతి చేసే రొయ్యలు, కౌంట్ ధర తగ్గించి కంపెనీలు కొంటున్నాయని తెలిపారు. రైతు సంఘం నేత వై.కేశవరావు మాట్లాడుతూ, భారత్‌పైనే అమెరికా అత్యధిక సుంకాలు వేసిందని, పక్కనే ఉన్న బంగ్లాదేశ్, శ్రీలంకలపై 20శాతం, పాకిస్తాన్ ఎగుమతులపై 19శాతం, మనతో పోటీగా రొయ్యల ఎగుమతి చేసే ఈక్విడార్‌కు 13.78శాతం సుంకాలు విధించి భారత్‌పై అక్కసు వెళ్లగక్కిందన్నారు. రైతుపై సుంకాల ప్రభావం పడకుండా ఉండేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. ఐద్వా ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ, ఆక్వా రంగంలో మహిళల పాత్ర గణనీయమైనదని, ఈ రంగం సంక్షోభంలో పడితే రైతాంగంతో పాటు మహిళలు కూడా ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆందోళన వ్యక్తం చేశారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు తీర్మానం ప్రవేశపెడుతూ, కేంద్ర ప్రభుత్వం ఎంపెడా కౌంటర్ గ్యారెంటీ ఇచ్చి ఆక్వా ఉత్పత్తులను ప్రస్తుత ధర కంటే తక్కువ లేకుండా మొత్తం కొనుగోలు చేస్తామని భరోసా ఇవ్వాలని, కేంద్ర ఎక్స్‌పోర్టర్స్ ధర తగ్గించి కొనుగోలు చేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డిమాండ్ల సాధన కోసం వ్యవసాయశాఖ మంత్రికి, ముఖ్యమంత్రికి వెంటనే వినతిపత్రాలు ఇవ్వాలని, ఆక్వాసాగు ఉన్న అన్ని జిల్లాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు, సదస్సులు, బహిరంగ సభలు నిర్వహించి నిరసనలు తెలియజేయాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో ఆక్వాటిక్ ఎడిటర్ కోనా జోసఫ్, ఆక్వారంగ నిపుణులు షేక్ ఆలీ హుస్సేన్, ఆక్వా రైతు సంఘం పశ్చిమగోదావరి జిల్లా కన్వీనర్ ఆర్.సూర్యనారాయణరాజు, రైతు నేతలు రావి వెంకట్రావు, ఎం. శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, మోరు రామరాజు తదితరులు ప్రసంగించారు.



'ట్రంప్ పన్నులు, ఆక్వా రైతుపై ప్రభావం' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రసంగిస్తున్న బలరామ్

బిడ్డ.. నువ్వు ఎక్కడ!

(5వ పేజీ తరువాయి)

రొయ్యూరు తీసుకువచ్చాడు. అమ్మమ్మ, తాతకు చూపించి సాయంత్రానికి నిమ్మకూరు తీసుకువస్తానని నిదీష్ తల్లిదండ్రులకు బాలకృష్ణ చెప్పాడు. అదేరోజు సాయంత్రానికి నిదీష్ అదృశ్యమయ్యాడు. కేఈబీ కెనాల్ పక్కన ఉన్న రామాలయం వద్ద చేతిపంపు నుంచి మంచినీరు తాగటం మాత్రమే కొందరు చూశారు. చెప్పులు దగ్గర్లో ఓ ఇంటి వద్ద విడిచి ఉన్నాయి. దీంతో కాలువలో పడ్డాడని నాలుగు రోజుల పాటు కోడూరు వరకు గాలించినా ఫలితం లేదు. దీంతో గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ ఆదేశాలతో నాలుగు టీంలు ఏర్పాటు చేసి అనేక ప్రాంతాల్లో గాలించినా జాడ తెలియలేదు. మేనమామ బాలకృష్ణని, అతనికి ఫోన్‌లు చేసిన స్నేహితులను, ఇతర బంధువులను పోలీసులు స్టేషన్‌కు తీసుకు వచ్చి రకరకాలుగా ప్రశ్నించినా ఎలాంటి సమాచారం రాలేదని చెబుతున్నారు. ఈ నెల రోజులుగా అన్ని కోణాల్లో దర్యాప్తు చేసినా నిదీష్ ఆచూకీ లభ్యం కాలేదని ఎస్సై సీహెచ్ అవినాష్ తెలిపారు. ఇంకా గాలింపు కొనసాగుతూనే ఉందన్నారు.

కన్నీళ్లు దిగమింగుకుని ఎదురు చూస్తున్న తల్లిదండ్రులు

ఒక్కగానొక్క మగ బిడ్డ నిదీష్‌ని అల్లారుముద్దుగా పెంచుకుంటున్న తల్లిదండ్రులు దుర్గా శ్రీనివాసరావు, సరోజిని తమ బిడ్డ అదృశ్యంపై నెల రోజులుగా కన్నీటితో తల్లడిల్లిపోతున్నారు. నిమ్మకూరు విడిచి రొయ్యూరులోనే ఉండి పోలీసులతో కలిసి గాలింపు చర్యల్లో పాల్గొన్నారు. ఎంత వెదికినా జాడ లేకపోవటంతో దేవుడా మా బిడ్డను మా దగ్గరకు తీసుకురావయ్యా అంటూ ప్రార్థనలు చేశారు. బిడ్డ తిరిగి వస్తాడని ఆశతో ఎదురు చూస్తున్నారు. ఎవ్వరు వచ్చినా తల్లి సరోజిని నిదీష్ కనిపించటం లేదని ముద్రించిన పోస్టర్‌ని చూపుతూ కన్నీటి పర్యంతమవుతోంది.

తాత్సారం!

(5వ పేజీ తరువాయి)

లేకపోవటంతో ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టనీయటం లేదు.

2019-24 ఓకే..
మరి 2014 - 19 మాటేమిటి?

గత టీడీపీ ప్రభుత్వంలో 2014 - 19 కాలంలో పీఎంఏవై గ్రామీణ ఇళ్లకు అనుమతి ఇచ్చింది. అప్పట్లో చేపట్టిన వేల సంఖ్యలో ఇళ్లకు ఇప్పటి వరకు బిల్లులు చెల్లించలేదు. కొన్ని నిర్మాణాలు ఇప్పటికీ అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. వీటిని పూర్తి చేయటానికి సహాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కాగా, వైసీపీ ప్రభుత్వ హయాంలో 2019 - 2024 మధ్య చేపట్టిన పీఎంఏవై ఇళ్లకు సంబంధించి అసంపూర్తిగా ఉన్న వాటికి అదనంగా రూ.50 వేల ఆర్థిక సహాయం అందిస్తున్నారు. 2014 - 19 నాటి ఇళ్ల కూడా అదనపు ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందించాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.

బ్యారేజీకి మళ్లీ వరద!

(5వ పేజీ తరువాయి)

విడుదల చేసిన అధికారిక ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 11వ తేదీ ఉదయం 10.30 గంటలకు 70,738 క్యూసెక్కులను, మధ్యాహ్నం రెండు గంటలకు 1.08 లక్షల క్యూసెక్కులను, రాత్రి తొమ్మిది గంటలకు 1.44 లక్షల క్యూసెక్కులను బ్యారేజీ నుంచి విడుదల చేశారు. మంగళవారం ఉదయానికి వరద ప్రవాహం తగ్గడంతో ఏడు గంటలకు 94 వేల క్యూసెక్కులను మాత్రమే సముద్రంలోకి పంపారు. అయితే హైదరాబాద్‌లో పడుతున్న భారీ వర్షాల కారణంగా మూసీ నది వరద నీరు దాచేపల్లి వద్ద మంగళవారం రాత్రి కృష్ణానదిలో కలిసి, ఈ వరద అక్కడ నుంచి పులిచింతల ప్రాజెక్ట్‌కు చేరుతుందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు మునేరు వాగు నుంచి వరద నీరు కృష్ణానదిలో చేరుతుంది. నది ఎగువ ప్రాంతంలో ఈ నెల 13, 14, 15, 16 తేదీల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో రానున్న రోజుల్లో భారీ వరద ప్రకాశం బ్యారేజీని తాకే అవకాశం ఉందని నీటి పారుదలశాఖ అధికారులు చెబుతున్నారు.

యంత్రాంగం అప్రమత్తం

కృష్ణాకు వరద రానున్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాగాన్ని, నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. విపత్తుల నిర్వహణ శాఖ హెచ్చరికలతో మంగళవారం రాత్రి ఆయన పలు శాఖల ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అర్బన్ హెల్త్ సెంటర్, పోలీస్, రెవెన్యూ, వీఎంసీ అధికారులు, సిబ్బందికి ప్రత్యేక విధులను కేటాయించాలని ఆయా శాఖల ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరుతున్న తరుణంలో 24/7 అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మహిళలకు ఉచితం ఎఫెక్ట్

ఆర్టీసీలో కండక్టర్ల కొరత!

- ఓడీల రద్దుపై అధికారుల వివక్ష



(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఆర్టీసీకి కండక్టర్ల కొరత ఏర్పడింది. మహిళల ఉచిత బస్సు పథకం అమలుకు తగిన సంఖ్యలో కండక్టర్లు లేరు. దీంతో ఓడీలలో ఉన్న కొంతమంది కండక్టర్లను రప్పించాలని, అవసరమైతే డ్రైవర్లను కూడా కండక్టర్లుగా వినియోగించాలని అధికారులు భావిస్తున్నారు. పూర్తిస్థాయిలో ఓడీలు చేస్తున్న కండక్టర్లందరినీ అన్ని శాఖలు, అన్ని విభాగాల నుంచి తిరిగి వెనక్కు తీసుకురావాల్సిన అవసరం ఉంది. కానీ కొన్ని విభాగాలలో పనిచేసే వారినే కండక్టర్లుగా ఉపయోగించుకోవాలనుకోవటం విమర్శలు దారి తీస్తోంది.

మరో రెండు రోజుల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రారంభం కానున్న 'మహిళలకు ఉచిత ప్రయాణం' పథకాన్ని దృష్టిలో ఉంచుకుని సంస్థలో కొనసాగుతున్న అవుట్ ఆఫ్ డిజిగ్నేషన్ (ఓడీ) డ్యూటీలను రద్దు చేయాలని ఆర్టీసీ యాజమాన్యం భావిస్తోంది. వాస్తవ విధులకు భిన్నంగా వివిధ శాఖలు, విభాగాలలో పనిచేస్తున్న వారంతా ఓడీ కేటగిరీలోకి వస్తారు. ప్రస్తుతం కండక్టర్ల కొరత నేపథ్యంలో దీనిని అధిగమించేందుకు కొన్ని విభాగాలలో ఓడీ విధానంలో పనిచేస్తున్న వారిని కండక్టర్లుగా ఉపయోగించుకోవాలని భావిస్తోంది. డ్రైవర్లుగా ఉన్న వారిని కూడా కండక్టర్లుగా పంపాలని భావిస్తోంది.

- గత వైసీపీ ప్రభుత్వంలో ఆర్టీసీలో పనిచేసే వారిని టీఆర్అండ్‌బీ పరిధిలోకి కొంతమందిని ఓడీ విధానంలో పనిచేసేందుకు పంపించారు. ఆర్టీసీ హౌస్‌లో ఐటీ, పీఎఫ్, పర్సనల్ డిపార్ట్‌మెంట్, సీఈడీ, అక్కౌంట్స్ తదితర విభాగాలలో ఓడీ విధానంలో 70 మంది పైగా పనిచేస్తున్నారు. ఆయా శాఖలు, విభాగాలలో పనులు చేయటానికి అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని తీసుకుంటే సరిపోతుంది. ఆయా శాఖలు, విభాగాలకు పంపిన వారంతా అక్కడ డేటా ఎంట్రీ ఉద్యోగాలే చేస్తున్నారు. లక్షలాది రూపాయలు జీతాలు ఇచ్చి కండక్టర్లను ఈ విధులకు తీసుకునేకంటే .. రూ. 15 - 20 వేలు ఇచ్చి అవుట్‌సోర్సింగ్ విధానంలో తీసుకోవటానికి అవకాశం ఉంది. హెడ్డాఫీసుల్లో పనిచేసే వారిని తొలగిస్తే పనులు ఆగిపోతాయన్న వాదనలను అధికారులు తీసుకువస్తున్నారు. ఉన్నతాధికారులకు కూడా అధికారులు తప్పుడు నివేదికలు ఇస్తున్నారు. గతంలో సురేంద్రబాబు ఎండీగా ఉన్న సమయంలో ఇలాంటి ఓడీలన్నింటినీ రద్దు చేసి ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమించాలని ఆదేశాలు ఇచ్చారు. ఇది అమలు జరిగేలోగా ఆయన బదిలీతో ప్రక్రియ ఆగిపోయింది. ఆర్టీసీ హౌస్, ఎన్టీఆర్ జిల్లా రీజియన్, పీఎన్‌బీఎస్‌లలో కూడా కొంతమంది అధికారులు తమకు కావాల్సిన వారి కోసం అనధికారికంగా ఓడీలలో కొనసాగిస్తున్నారు. అనధికారిక ఓడీలను రద్దు చేయాల్సిన అవసరం ఉంది.
- రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం పథకాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించటంతో ఆర్టీసీకి కండక్టర్ల కొరత ఏర్పడింది. చాలా కాలంగా ఆర్టీసీ సర్వీసులను అధికారులు తగ్గిస్తూ వస్తున్నారు. దీంతో కండక్టర్ల సమస్య పెద్దగా కనిపించలేదు. మహిళలకు ఉచిత బస్సు పథకం వల్ల ప్రయాణాలు పెరగటమే కాకుండా సర్వీసులను పెంచాల్సి వస్తోంది. దీంతో ఇప్పుడు కండక్టర్ల సమస్య కనిపిస్తోంది. ఈ సమస్యను పరిష్కరించుకోవటానికి ఎంచుకున్న విధానం పక్షపాతంతో ఉందన్న విమర్శలు వస్తున్నాయి.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 505

సుపరిపాలనతోనే గ్రామీణాభివృద్ధి



హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మౌలికసదుపాయాలు కల్పిస్తూ సంక్షేమ పథకాలను సకాలంలో అందజేయడం కూటమి ప్రభుత్వ సుపరిపాలనతోనే సాధ్యమని క్లస్టర్ ఇంచార్జి చిన్నాల లక్ష్మీనారాయణ తెలిపారు. కొయ్యూరులో మంగళవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా టీడీపీ అధ్యక్షుడు తూమాటి సాంబశివరావుతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు గురించి వివరించారు. కరపత్రాలను పంపిణీ చేస్తూ సంక్షేమ పథకాల అమలు తీరు, సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అజయ్‌కుమార్, వెలగా రాంబాబు, శ్రీనివాసరావు, కర్రా ప్రసాద్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళాలు

గన్నవరం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : పాత గన్నవరంలోని లక్ష్మీ తిరుపతమ్మ ఆలయ అభివృద్ధికి ఏలూరు జిల్లా కాగుపాడు గ్రామానికి చెందిన కడియాల రంగారావు, అనురాధ దంపతులు కడియాల రామయ్య జ్ఞాపకార్థం రూ.లక్ష విరాళాన్ని ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్‌కు మంగళవారం అందజేశారు. విజయవాడకు చెందిన సూర్యదేవర సాంబశివరావు, విజయకుమారి దంపతులు రూ.10వేలు మర్లపాలెంకు చెందిన జాస్తి శ్రీహరి, ఇందిర దంపతులు రూ.10వేలు అందజేశారు.

లక్ష్యసాధనతో రాణిస్తే ఏదైనా సాధించవచ్చు : సీఐ

గన్నవరం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : లక్ష్యసాధనతో రాణిస్తే ఏదైనా సాధించవచ్చని సీఐ బీవీ శివప్రసాద్ అన్నారు. మండలంలోని ముస్తాబాదకు చెందిన పాలా ప్రవీణ్‌కుమార్ ఇటీవల విడుదలైన కానిస్టేబుల్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించగా కోచింగ్ తీసుకున్న విస్సన్నపేట కుమార్ ఎడ్యుకేషనల్ సొసైటీ కోచింగ్ సెంటర్ అధినేత అప్పికట్ల కుమార్ మంగళవారం దుశ్శాలువ పూలమాలలతో అతని తల్లిదండ్రులైన కాంతారావు, జయప్రదలను కూడా ఘనంగా సన్మానించారు. న్యాయవాది నల్లమోతు రమేష్, ఉయ్యూరు ఆంజనేయులు, టీడీపీ నాయకులు పాలడుగు రత్నారావు, చోడవరపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



డ్రెయిన్‌లో వ్యర్థాల తొలగింపు

కానూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : సారూ.. వ్యర్థాలను తొలగించరూ అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి తాడిగడప మున్సిపల్ అధికారులు స్పందించారు. మంగళవారం తాడిగడప మున్సిపల్ శానిటరీ సిబ్బంది కానూరు ఎస్‌బీఐ కాలనీలోని అంగన్వాడీ కేంద్రం వద్ద ఓపెన్ డ్రెయిన్‌లో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తా చెదారాన్ని తొలగించి శుభ్రపరిచారు.

కాల్వలో దూకి యువకుడి ఆత్మహత్య

పెనమలూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : యనమలకుదురు జన్మభూమి వంతెన సమీపంలోని కాల్వలో దూకి యువకుడు ఆత్మహత్య చేసుకొన్న ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యనమలకుదురుకు చెందిన మెడ పునీత్‌వర్మ (20) అనే యువకుడు సోమవారం రాత్రి యనమలకుదురు జన్మభూమి వంతెన సమీపంలోని కాల్వలో దూకినట్లు అతని తండ్రి మెడ శివరామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సాయంతో గాలింపు చేపట్టగా పునీత్‌వర్మ మృతదేహం లభ్యమయింది. పునీత్‌వర్మ మృతికి కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు.

కిక్‌బాక్సింగ్ మాస్టర్‌కు జాతీయ అవార్డు

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పవర్ కిక్‌బాక్సింగ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు వర్రె అంజిబాబు నేషనల్ స్టార్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. ఇటీవల గుణదలలో వైఎంకే మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన మార్షల్ ఆర్ట్స్ జాతీయ స్థాయి పోటీల్లో అంజిబాబు అవార్డు సొంత చేసుకున్నారు. ప్రముఖ సినీ నటుడు భానుచందర్ చేతులు మీదుగా అవార్డును అందుకున్నట్లు అంజిబాబు తెలిపారు. ఈ సందర్భంగా అంజిబాబును ఎస్సై విసురేష్‌తో పాటు పలువురు మార్షల్ ఆర్ట్స్ అభిమానులు, అభ్యాసకులు అభినందించారు.





ముదునూరు పీఏసీఎస్ వద్ద యూరియా కోసం ఆందోళనకు దిగిన రైతులు.. ఉంగుటూరు పీఏసీఎస్ వద్ద.. రంగన్నగూడెంలో ఎరువుల గౌడన్ తనిఖీ చేస్తున్న అధికారులు

యూరియా కోసం రైతుల ఆందోళన

- పెద్ద రైతులకు ఇస్తున్నారని, సన్న చిన్నకారుకు ఇవ్వటం లేదంటున్న ముద్దునూరు రైతులు
- అందరికి అందిస్తామంటున్న అధికారులు

ఉయ్యూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : పలుకుబడి కలిగిన వారికి, పెద్దరైతులకే యూరియా ఇస్తున్నారు, చిన్న, సన్నకారు రైతులకు ఇవ్వడం లేదని ముదునూరులో రైతులు మంగళవారం ఆందోళనకు దిగారు. గ్రామంలో పీఏసీఎస్‌కు పది టన్నులు, ఎరువుల వ్యాపారికి 20 టన్నులు యూరియా సోమవారం సాయంకాలం రాగా తీసుకునేందుకు రైతులు మంగళవారం పీఏసీఎస్‌కు, ఎరువుల దుకాణానికి చేరుకున్నారు. పీఏసీఎస్‌లో అందరికి సరిపడా యూరియా లేక పోవడంతో రైతులు ఆందోళన చేపట్టారు. తహసీల్దార్ ఎం.సురేశ్‌కుమార్, ఏవో నిస్సీగ్రేస్, రూరల్ ఎస్సై కె.సురేశ్‌బాబు అక్కడకు చేరుకుని యూరియా నిల్వపై పీఏసీఎస్ సెక్రటరీ శ్రీనివాసరావుతో సమీక్షించారు. మరో 10టన్నుల వస్తే అందరికి సరిపోతుందని సెక్రటరీ తెలుపగా మార్క్‌ఫెడ్, జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి పరిస్థితి తెలియపరిచారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ, అందరికి సరిపడా యూరియా పంపించేందుకు అధికారులు హామీ ఇచ్చారని, ఇప్పుడు అందని వారి పేర్లు నమోదు చేసుకుని త్వరలో పంపిణీ చేస్తామని నచ్చ చెప్పారు. జైకెమికల్స్ ఎరువుల వ్యాపారి పెద్ద రైతులకే యూరియా అమ్ముతూ చిన్న సన్నకారు రైతులకు అమ్మను పొమ్మంటున్నాడని, గుళికలు కూడా తీసుకుంటేనే యూరియా ఇస్తానని, అదికూడా ఎక్కువ ధర చెబుతున్నాడని, ప్రస్తుతం అవసరం లేకపోయినా గుళికలు తీసుకుని ఏమి చేసుకోవాలని రైతులు అధికారులకు మొరపెట్టుకున్నారు. దీనిపై వ్యాపారిని అధికారులు వివరణ కోరగా యూరియాతో పాటు గుళికలు కూడా తీసుకోవాలని డిస్ట్రిబ్యూటర్ పంపించారని ఎవరూ కొనకపోతే నేనేమి చేసుకోవాలని వ్యాపారి చెప్పగా ప్రస్తుతానికి గుళికలతో ముడిపెట్టకుండా స్టాకు ఉన్నంత వరకు యూరియా విక్రయించాలని అధికారులు జై కెమికల్స్ ఎరువుల వ్యాపారికి సూచించారు.

ఉంగుటూరులో..

ఉంగుటూరు : మండలంలో యూరియా కోసం రైతులకు అవస్థలు తప్పడంలేదు. ఆయా పీఏసీఎస్‌ల వద్ద గంటల తరబడి వేచివున్నా కొందరికి మాత్రమే యూరియా బస్తాలు అందడంతో మిగతావారు వ్యవసాయశాఖ అధికారులు, పీఏసీఎస్‌ల నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగుతున్నారు. ఈ నేపథ్యంలో ఉంగుటూరు సొసైటీకి సోమవారం 10 టన్నుల యూరియా రాగా రైతుల ఆందోళన వల్ల పంపిణీ జరగలేదు. దీంతో మంగళవారం సాయంత్రం అదనంగా మరో 10టన్నుల యూరియా వ్యవసాయశాఖ సరఫరా చేసింది. సమాచారం అందుకున్న స్థానిక రైతులతోపాటు సమీప గ్రామాల రైతులు భారీగా తరలివచ్చి యూరియా కోసం క్యూలైన్లలో నిలబడ్డారు. పరిస్థితిని గమనించిన పీఏసీఎస్ నిర్వాహకులు, పోలీస్, రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారుల పర్యవేక్షణలో ఆధార్‌కార్డు ఆధారంగా రెండు బస్తాల చొప్పున యూరియా అందజేశారు.

ఎరువుల గౌడన్‌లో తనిఖీలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : రైతులకు సకాలంలో ఎరువులు అందజేసేలా చర్యలు తీసుకున్నామని, రైతులు ఆందోళన చెందకుండా అవసరమైనంత మేరకు సద్వినియోగం చేసుకోవాలని ఏవోబి.రంగనాథ్‌బాబు సూచించారు. రంగన్నగూడెం పీఏసీఎస్ ద్వారా ఎరువుల పంపిణీ, గోడౌన్‌లో ఉన్న ఎరువులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. మండల వ్యాప్తంగా పీఏసీఎస్‌ల ద్వారా పంపిణీ చేస్తున్న ఎరువులను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నామన్నారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి వరి పంటకు 3దశల్లో ఎరువుల వినియోగం గురించి రైతులకు సూచనలిచ్చారు. ఉద్యానవనశాఖ అధికారి జోసఫ్, పీఏసీఎస్ చైర్‌పర్సన్ కనకవల్లి శేషగిరిరావు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి

- ఎన్టీఆర్ జిల్లా డీఏవో విజయకుమారి

విజయవాడ రూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని, సంప్రదాయ ఎరువులు, నానో ఎరువులపై అవగాహన పెంచుకోవాలని ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) విజయకుమారి కోరారు. విజయవాడ రూరల్ మండలం నున్నలోని రైతు సేవా కేంద్రంలో మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి విజయకుమారి ముఖ్యఅతిథిగా హాజరై రైతులతో సమావేశమైయ్యారు. గ్రామ ఆదర్శ రైతు కొల్లి కోటిరెడ్డి పంట పొలంలో ప్రయోగాత్మకంగా డ్రోన్ సాయంతో నానో యురియా చల్లించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు బీ వెంకటేశ్వరరావు, కుర్రా రఘురాం, ఉద్యాన అధికారులు పరమేశ్వరరెడ్డి నున్న గ్రామ పీఏసీఎస్ అధ్యక్షుడు కలకోటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



డ్రోన్ సాయంతో నానో ఎరువుల పిచికారీని పరిశీలిస్తున్న ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ అధికారి విజయకుమారి



విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్, దేవినేని రాజా

ఎన్నికల హామీలు నెరవేరుస్తున్నాం

అన్నదాత సుఖీభవ విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అన్ని ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. అన్నదాతా సుఖీభవ నగదు రైతుల ఖాతాల్లో జమ అయిన నేపథ్యంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా ఆధ్వర్యంలో ఈడుపుగల్లులో విజయోత్సవ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. దేవినేని రాజా మాట్లాడుతూ అన్నదాతా సుఖీభవ కార్యక్రమంలో సుమారు 100 ట్రాక్టర్ల ర్యాలీలో రైతులు స్వచ్ఛందంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పందిపాటి ఇందిర, అనుమోలు ప్రభాకర్, కోయా ఆనంద్ ప్రసాద్, ఉయ్యూరు ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్, కంకిపాడు ఏఎంసీ వైస్ చైర్మన్ మల్లంపాటి కళ్యాణి, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు పందిపాటి సుధాకర్, షేక్ మాబు సుబాని, షేక్ షకార్, పులి శ్రీనివాసరావు, కిలారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధార్థ డీమ్డ్ వర్సిటీలో మెగా రక్తదాన శిబిరం




కానూరు, ఆగస్టు 12 (ఆంధ్ర జ్యోతి) : సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం జరిగింది. పిన్నమనేని సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి ఫౌండేషన్ సహ కారంతో జరిగిన ఈమెగా వైద్య శిబిరాన్ని వర్సిటీ వైస్‌చాన్సలర్ పరుచూరి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. 102 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రో. వీసీ ఏవీ రత్నప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం. రవిచంద్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ జె. శివరాం ప్రసాద్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి. సుష్మాచౌదరి, డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, డాక్టర్ జాస్మిన్ సుల్తాన్ తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

గౌతు లచ్చన్న జయంతిని విజయవంతం చేయండి

కంకిపాడు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ నెల 16న నిర్వహించనున్న స్వతంత్ర సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ల బుల్లయ్య అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం మాట్లాడుతూ, గౌతు లచ్చన్న జయంతి కార్యక్రమాని కూటమి ప్రభుత్వ హయాంలో అధికారకంగా నిర్వహించటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, డైరెక్టర్ శొంఠి శివరామ ప్రసాద్, బత్తిన దాసు, సంగెపు రంగారావు, వీరంకి పావనమూర్తి, కొండవీటి శివయ్య, చిట్టూరి నాగేశ్వరరావు, కొణతం సుబ్రహ్మణ్యం, ఆకునూరి సుబ్బారావు, అన్నవరపు శివపార్వతి, మల్లంపల్లి కళ్యాణి, ఈడ రంగరావు, ఈడా కోటేశ్వరరావు, బొర్రా వెంకట్ పాల్గొన్నారు.

రక్తహీనతపై బాల్యం నుంచి అవగాహన ఉండాలి



గుణదల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బాల్యం నుంచి రక్తహీనతపై అవగాహన ఉండాలని ఎన్టీఆర్ జిల్లా డిప్యూటి వైద్య అధికారిణి పి.ఇందుమతి అన్నారు. నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించే కార్యక్రమం ప్రసాదంపాడు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో విజయవాడ రూరల్ వైద్యాధికారి డాక్టర్ నిరంజన్, సూపర్‌వైజర్ పి.వి. సాంబశివరావు, ఎమ్ఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎమ్‌లు పాల్గొన్నారు.

ఆక్యుపంక్చర్ సహజ వైద్యవిధానంతో ఉపాధి

కానూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : కానూరు అశోక్‌నగర్‌లోని ఇండియన్ ఓం హోలిస్టిక్ హెల్త్‌కేర్ సంస్థ ప్రభుత్వ ఖాదీ ఇండస్ట్రీస్ బోర్డ్‌తో ఆక్యుపంక్చర్ సహజ వైద్యవిధానంపై శిక్షణ ఇవ్వడానికి ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు ఏపీ ఖాదీ బోర్డు సీఏవో ఎన్. రవికుమార్‌తో ఇండియన్ ఓం వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ అవగాహన ఒప్పందం (ఎంవోయూ) చేసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యనారాయణ మంగళవారం కానూరులో విలేఖరులతో మాట్లాడుతూ, యోగాంధ్ర ఆక్యుపంక్చర్ ఆక్యూ ప్రెషర్ మల్టీ థెరపీ సర్వీస్ సెంటర్స్ అభివృద్ధికి ఇరువురు కలిసి పనిచేయాల్సి ఉంటుందన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యం

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యవంతమైన భావి భారత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరం పాటుపడాలని బాపులపాడు ఎంపీపీ వై.నగేష్ అన్నారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా బాపులపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు కె. గంగాభవాని, హైస్కూల్ హెచ్‌ఎం ఎం. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉంగుటూరు: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో మంగళవారం నులిపురుగుల నివారణ (ఆల్బెండజోల్) మాత్రలు పంపిణీ చేసినట్లు నాలుగు పీహెచ్‌సీల వైద్యాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ బి.శిరీష, డాక్టర్ వీవీ.పద్మావతి, డాక్టర్ విజయ్‌ప్రదీప్, డాక్టర్ తేజాకిరణ్, డాక్టర్ టి.జితేంద్రకుమార్, డాక్టర్ కరీముల్లా మొహినుద్దీన్, డాక్టర్ సుజిత, ఎంపీహెచ్‌ఈవోలు జి.రత్నబాబు, జీవకాంత్‌రాజు, శివరామకృష్ణ పాల్గొన్నారు.

ఉయ్యూరు : జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకుని ఉయ్యూరు, కాటూరు, చినఓగిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పాఠశాలలు, జూనియర్ కళాశాలల విద్యార్థులకు మంగళవారం నులిపురుగుల నిర్మూలనకు మందులు పంపిణీ చేశారు. ఆకునూరు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఎం.ఆదినారాయణ పాల్గొని విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలన మందులు పంపిణీ చేశారు.

ఘనంగా సిద్ధార్థ బీఈడీ కళాశాల వార్షికోత్సవం

కానూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కానూరులోని వైవీ రావు సిద్ధార్థ బీఈడీ కళాశాలలో మంగళ వారం కళాశాల వార్షికోత్స వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బీఈడీలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శేషశ్రీ అధ్యక్షతన జరిగిన వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ అధ్యక్షుడు వేములపల్లి కేశవరావు మాట్లాడుతూ, విద్యార్థులకు పాఠ్యాంశాలతోపాటు వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు, సామాజిక బాధ్యత అంశాలను కూడా ఉపాధ్యాయులు బోధించాలని సూచించారు. గౌరవ అతిథి విజయవాడ ఎన్విరాన్‌మెంటల్ సెంటర్ అధికారి, పర్యావరణ వేత్త కాకర్ల వెంకట రత్నం ప్రసంగిస్తూ సమాజానికి ఉపయోగపడే విధంగా ఉపాధ్యాయుడు ఉండాలన్నారు.

ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఉయ్యూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో ఎక్కువ మంది విద్యార్థుల ప్రవేశాలతో పాటు ఉత్తమ పరీక్ష ఫలితాల సాధనకు కృషిచేయాలని ఇంటర్మీడియట్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఎం. ఆదినారాయణ అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్‌తో మంగళవారం ఆకునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమీక్ష సమావేశం నిర్వహించి పరీక్ష ఫలితాలు, ప్రవేశ ప్రక్రియ, బోధనా ప్రణాళిక, పరిపాలన అంశాలపై చర్చించి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. డిప్యూటీ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ జిల్లా డిప్యూటీ ఆఫీసర్ ఎస్. సరళకుమారి, కళాశాల ప్రిన్సిపాల్ విఎస్‌బిఆర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేయాలి

గన్నవరం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి వెంటనే పీఆర్‌సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని నేషనల్ మజ్దూర్ యూనిటి అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నాగిరెడ్డి అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజ్ వద్ద అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం ధర్నా నిర్వహించారు. డిపో నాయకులు దాసు, ఆంజనేయులు, ఉషారాణి, ప్రభాకరరావు, నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

మా క్లయింట్లు యన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ, అంజనేయవాగు వీధిలో గల వడ్డెర కళ్యాణ మండపం వద్ద గల డోర్.నెం. 4-2-137ఎ కాపురస్తులు 1) శివరాత్రి విజయ్ కుమార్ గారి కుమారుడు శివరాత్రి నిరంజన్ కుమార్ మరియు వీరి కుమారుడు 2) శివరాత్రి వెంకట యశ్వంత్ రాజ్ గార్ల వద్ద నుండి సంజాయిషీ పొంది యిందుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా.

మా క్లయింట్లు యీ దిగువ షెడ్యూల్లు దాఖలా స్థిరాస్తిని 1) గుంటూరు జిల్లా, కొత్తపేట, బాలాజీ నగర్ 5వ లైను డో.నెం. 16-8-84 కాపురస్తులు కలకోట వెంకట రామిరెడ్డి గారి కుమారుడు కలకోట గోపాలరెడ్డి గారు 2) కృష్ణాజిల్లా, నున్న కాపురస్తులు చింతలబజారు డో.నెం. 1-25 కాపురస్తురాలు కలకోట విష్ణువర్ధనరెడ్డి గారి భార్య కలకోట నిర్మల గారు వారి సంతతి కలకోట రవీంద్రరెడ్డి, కలకోట శ్రీలత గారు 3) విజయవాడ కామయ్యతోపు, అన్నపూర్ణ కాలనీ, తాళ్ల రోశయ్య వీధి, డో.నెం. 8-56 కాపురస్తులు కలకోట వెంకటరామిరెడ్డి గారి కుమారుడు కలకోట చిన్న ప్రసాదరెడ్డి గార్ల వద్ద నుండి క్రయం పొందుటకు ఒప్పందం కుదుర్చుకునియున్నారు. సదరు పైన తెలిపిన కలకోట గోపాలరెడ్డి వగైరాలు వారి తాలూకు పూర్వార్జితపు ఆస్తులకు పంపకొన్న రత్యా వార్కి సంక్రమించినట్లుగా మా క్లయింట్లు వార్కి తెలిపియున్నారు. కావున మా క్లయింట్లు జరుపబోవు క్రయమును గురించి గాని, షెడ్యూలు దాఖలా స్థిరాస్తులను గురించి గాని ఎవరికైనా ఏ విధమైన అభ్యంతరములు దావా తగాయిదాలు, కోర్టు జప్తులు, తనఖా వగైరా హామీలు, మనోవర్తి క్లయిములు, పార్టీషన్ తగాయిదాలు ఏవైనా వున్న ఎడల తగిన లిఖిత పూర్వక ఆధారములతో వ్రాత పూర్వకముగా రిజిష్టరు పోస్టు ద్వారా యీ ప్రకటన తేదీ లగాయితూ 5 రోజులలోపు యీ దిగువ చిరునామాకు తెలియచేయగలరు. గడువులోపు ఎటువంటి అభ్యంతరములు రాని ఎడల సదరు ఆస్తి నిష్పేచీ గల ఆస్తిగా పరిగణించి మా క్లయింట్లు పేర రిజిష్టరు చేయించుకుందురనిన్నీ గడువు దాటి వచ్చిన అభ్యంతరములు పరిగణనలోనికి తీసుకొనబడవనిన్నీ అట్టి అభ్యంతరములు మా క్లయింట్లును బైండు చేయజాలవనిన్నీ యిందుమూలముగా యావన్మందికి తెలియచేయడమైనది. **షెడ్యూలు: 1వ అయిటం:** కృష్ణాజిల్లా, కంకిపాడు స॥రి॥ వారి యిలాకా కంకిపాడు మండలం, కుందేరు గ్రామ పంచాయితీ ఆర్.ఎస్.నెం. 282/3 దాఖలా స్థిరాస్తికి **హద్దులు: తూర్పు:** చవిటి కాలువ, **దక్షిణం:** జిల్లా పరిషత్ రోడ్డు, **పడమర:** చేకూరి నాగేంద్రరావు వగైరాల భూమి, **ఉత్తరం:** కలకోట చిన్న ప్రసాదరెడ్డి గారి ఆస్తి. యీ హద్దుల మధ్య య.1-02 సెంట్లు అందలి యావత్తు యాజమాన్యపు హక్కులతో సహా. **2వ అయిటం:** కృష్ణాజిల్లా, కంకిపాడు స॥రి॥ వారి యిలాకా కంకిపాడు మండలం, కుందేరు గ్రామ పంచాయితీ ఆర్.ఎస్.నెం. 282/3 దాఖలా స్థిరాస్తికి **హద్దులు: తూర్పు:** చవిటి కాలువ, **దక్షిణం:** కలకోట చిన్న ప్రసాదరెడ్డి గారి భూమి, **పడమర:** కలకోట చిన్న ప్రసాదరెడ్డి గారి భూమి వారి భూమి కొంత వరకు మరియు చెరుకూరి శ్రీనివాసరావు గారి భూమి, **ఉత్తరం:** బొమ్మారెడ్డి జ్యోత్స్న గారి భూమి. యీ హద్దుల మధ్య య.0-71 సెంట్లు పల్లం భూమి. **3వ అయిటం:** కృష్ణాజిల్లా, కంకిపాడు స॥రి॥ వారి యిలాకా కంకిపాడు మండలం, కుందేరు గ్రామ పంచాయితీ ఆర్.ఎస్.నెం. 282/1 దాఖలా స్థిరాస్తికి **హద్దులు: తూర్పు:** నందిపాటి రామిరెడ్డి గారి భూమి కొంత వరకు మరియు 2 లింకుల వెడల్పు గల పంటబోదె, **దక్షిణం:** పోలారెడ్డి మల్లేశ్వరి గారు విక్రయించిన భూమి, **పడమర:** కలకోట చిన్న ప్రసాదరెడ్డి గారి భూమి, **ఉత్తరం:** నందిపాటి రామిరెడ్డి గారి భూమి. యీ హద్దుల మధ్య య.0-32 భూమి, వెరశి య.1-03 సెంట్లు భూమి అందలి యావత్తు యాజమాన్యపు హక్కులతో సహా. **4వ అయిటం:** కృష్ణాజిల్లా, కంకిపాడు స॥రి॥ వారి యిలాకా కంకిపాడు మండలం, కుందేరు గ్రామ పంచాయితీ ఆర్.ఎస్.నెం. 282/3 దాఖలా స్థిరాస్తికి **హద్దులు: తూర్పు:** చవిటి కాలువ, **దక్షిణం:** కలకోట గోపాలరెడ్డి గారి భూమి, **పడమర:** కలకోట చిన్న ప్రసాదరెడ్డి గారి భూమి, **ఉత్తరం:** కలకోట విష్ణువర్ధనరెడ్డి గారి భూమి. యీ హద్దుల మధ్య య.1-03 సెంట్లు భూమి. **5వ అయిటం:** కృష్ణాజిల్లా, కంకిపాడు స॥రి॥ వారి యిలాకా కంకిపాడు మండలం, కుందేరు గ్రామ పంచాయితీ ఆర్.ఎస్.నెం. 281/2బి దాఖలా స్థిరాస్తికి **హద్దులు: తూర్పు:** కలకోట చిన్న ప్రసాదరెడ్డి గారి భూమి, **దక్షిణం:** చెరుకూరి నాగేంద్ర వగైరాల భూమి, **పడమర:** పంటబోదె, **ఉత్తరం:** చెరుకూరి శ్రీనివాసరావు గారి భూమి. యీ హద్దుల మధ్య య.0-53 సెంట్లు భూమి. **6వ అయిటం:** కృష్ణాజిల్లా, కంకిపాడు స॥రి॥ వారి యిలాకా కంకిపాడు మండలం, కుందేరు గ్రామ పంచాయితీ ఆర్.ఎస్.నెం. 280/2బి దాఖలా స్థిరాస్తికి **హద్దులు: తూర్పు:** కలకోట స్వర్ణ కుమారి గారి భూమి, **దక్షిణం:** నందిపాటి రామకృష్ణారెడ్డి గారు యితరులకు విక్రయించిన భూమి, **పడమర:** పంటబోదె, **ఉత్తరం:** కలకోట జ్యోత్స్న గారి భూమి. యీ హద్దుల మధ్య య.0-80 సెంట్లు భూమి. వెరశి పై మూడు ప్రతుల దాఖలా మొత్తం య.2-36 సెంట్లు భూమి అందలి యావత్తు యాజమాన్యపు హక్కులతో సహా.

ఇట్లు

పలివేటి లక్ష్మీనారాయణ, యం. మల్లిఖార్జునరెడ్డి

అడ్వకేట్లు

No. 1-F-4, D.No. 29-2-29, Sri Sai Thavanesh Towers, Rama Mandiram Street, Governorpet, Vijayawada-520002.

విజయవాడ, ది. 12-08-2025





వికసిత్ భారత్‌కు మానవ వనరులే కీలకం



వికసిత్ భారత్‌పై వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

బెంజిసర్కిల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : వికసిత భారత్, స్వర్ణాంధ్ర సాకారానికి అద్భుత మేథో సంపత్తితో పాటు విలువైన మానవ వనరులే కీలకమని కలెక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. మేరీస్ స్టెల్లా కళాశాల సమావేశ హాలులో మంగళవారం జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష ఆధ్వర్యం లో హ్యూమన్ క్యాపిటల్ ఫర్ వికసిత్ భారత్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ , భావిభారత పౌరులైన చిన్నారుల సమగ్రాభివృద్ధికి సరైన ప్రణాళికలతో సమిష్టి కృషి అవసరమన్నారు. వికసిత భారత్ లక్ష్యాలను చేరుకునేందుకు విద్యార్థులను తీర్చిదిద్దేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. 2047 నాటికి భారతదేశాన్ని పూర్తిగా అభివృద్ధి చెందిన దేశంగా ప్రపంచం ముందు నిలబెట్టాలనే గొప్ప లక్ష్యంతో రూపొందిన వికసిత్ భారత్ దార్శనికత లక్ష్యాలను సాధించేందుకు అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి అవసరమన్నారు. జెడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, డీఈవో యూవీ సుబ్బారావు, సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మహేశ్వరరావు, స్త్రీ శిశు సంక్షేమం, సాధికారత అధికారి షేక్ రుక్సానా సుల్తానా బేగం పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

కలెక్టరేట్ : స్వాతంత్ర్య దిన వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. స్వాతంత్ర్య దిన వేడుకల తుది ఏర్పాట్లను మంగళవారం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో కలెక్టర్ లక్ష్మీశ, నగర పోలీసు కమిషనర్ ఎస్‌వి. రాజశేఖరబాబుతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించేందుకు నగరపాలక సంస్థ, సాధారణ పరిపాలన శాఖ, వైద్య ఆరోగ్య, విద్యుత్, పోలీసు, ఫైర్ శాఖలతో సమన్వయం చేసుకొని ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తిచేయాలన్నారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి వేడుకలకు ప్రణాళికాబద్ధంగా అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులకు కేటాయించిన విధులను తు.చ తప్పకుండా పాటించాలన్నారు. సామాన్య ప్రజలకు, వీఐపీలు, వీవీఐపీలకు ప్రొటోకాల్ ప్రకారం ఏర్పాట్లు ఉండాలన్నారు. వాహనాలకు కేటాయించిన పార్కింగ్ ప్రదేశాన్ని మరోసారి పరిశీలించి లోటుపాట్లు లేకుండా చూడాలని సూచించారు. ఏర్పాట్ల పరిశీలనలో ఆర్డీవో కె.చైతన్య, అదనపు సీపీ కె.జి.వి.సరిత, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



బంగారు కుటుంబాలకు చేయూతనందిస్తామంటూ కలెక్టర్‌కు ప్రమాణపత్రాన్ని అందిస్తున్న ప్రతినిధులు

పీ-4లో భాగస్వాములవుతాం

● గాయత్రీ వొడాటెక్, కృష్ణా ఇంజనీరింగ్ వర్క్స్, డెవీ న్యూ లైఫ్ ప్రైవేట్ లిమిటెడ్ సంసిద్ధత

కలెక్టరేట్ : సమాజాన్ని పేదరికం నుంచి దూరం చేయాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు దార్శనికతకు అనుగుణంగా ప్రారంభించిన పీ-4 విధానంలో తామూ భాగస్వాములమవుతామని గాయత్రీ వొడాటెక్, కృష్ణా ఇంజనీరింగ్ వర్క్స్, డెవీ న్యూ లైఫ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశను మంగళవారం కలిసి తమ ఆసక్తిని తెలియజేశారు. గాయత్రీ వొడా టెక్ నిర్వాహకులు జి.వరప్రసాద్, తాను భవానీపురం ప్రాంతం హెచ్‌బీ కాలనీలోని 113 బంగారు కుటుంబాలకు మార్గదర్శిగా వ్యవహరిస్తానని వివరించారు. కృష్ణా ఇంజనీరింగ్ వర్క్స్ యజమాని బి.రాజశేఖర్ ఎనికేపాడులో 149 కుటుంబాలను దత్తత తీసుకునేందుకు ముందుకొచ్చారు. డెవీ న్యూ లైఫ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ అమిత్ జిందాల్ 37 కుటుంబాలను దత్తత తీసుకొని చేయూతనిస్తానని పేర్కొన్నారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటికే 4,669 మంది మార్గదర్శులు 37,780 కుటుంబాలను దత్తత తీసుకొన్నట్లు వివరించారు. పేదలు ఎప్పటికీ పేదలుగానే ఉండిపోకుండా వారూ అన్ని విధాలా ఎదిగి మనతో పాటు నడిస్తే ఆ ఆనందాన్ని వెలకట్టలేమన్నారు. పీ-4 లో మేము సైతం అంటూ స్వచ్ఛందంగా ముందుకొచ్చిన గాయత్రీ వొడాటెక్, కృష్ణా ఇంజినీరింగ్ వర్క్స్, డెవీ న్యూ లైఫ్ యజమాన్యాలకు కలెక్టర్ లక్ష్మీశ ధన్యవాదాలు తెలిపారు.



పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌ను పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు

సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు

● సీపీ ఎస్.వి.రాజశేఖరబాబు

బస్‌స్టేషన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు తెలిపారు. ఈనెల 15వ తేదీన మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు విచ్చేస్తున్న నేపథ్యంలో విజయవాడ ఆర్టీసీ బస్టాండ్‌లో బందోబస్తు ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. కృష్ణలంక పోలీసు స్టేషన్ పరిధిలోని పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో జరగనున్న ఈ కార్యక్రమంపై అధికారులు, సిబ్బందికి ఆయన తగు సూచనలు చేశారు. భద్రతా పరంగా ఏ చిన్నపాటి లోపం కూడా లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని శాఖల సమన్వయంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు ఉండకూడదన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయటంతో పాటు పార్కింగ్ ప్రదేశాలను కూడా ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. డీసీపీ ఎస్.వి.డి ప్రసాద్, సౌత్ ఏసీపీ పవన్ కుమార్, ఇతర ఏసీపీలు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.



డీఎస్సీ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రతిభ కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు జంపాన సుధాకర్

ప్రతిభ కోచింగ్ సెంటర్ అభ్యర్థుల సత్తా

● స్టేట్ ర్యాంకుతో పాటు 300 మందికి ఉద్యోగాలు

విజయవాడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలోని ప్రతిభ కోచింగ్ సెంటర్ అభ్యర్థులు డీఎస్సీ ఫలితాల్లో ప్రతిభను చాటారు. కోచింగ్ సెంటర్ అభ్యర్థి స్టేట్ ర్యాంకు సాధించడంతో పాటు 300 మందికి పైగా అభ్యర్థులు ఉద్యోగాలు పొందుతారని కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు జంపాన సుధాకర్ తెలిపారు. తమ వద్ద శిక్షణ పొందిన అభ్యర్థులకు అత్యధిక మార్కులు రావడం సంతోషంగా ఉందన్నారు. శిక్షణ విషయంలో రాజీ పడలేదని, అభ్యర్థులకు ఏ అధ్యాపకుడు నచ్చకపోయినట్టు సమాచారం అందించినా వారిని వెంటనే మార్చే వారమన్నారు. అందువల్లే ఎక్కువ మంది అభ్యర్థులు తమ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకోవడంతో పాటు వారి మన్ననలు పొందగలుగుతున్నామన్నారు. కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన అభ్యర్థులందరూ మంచి స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ జట్టు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ జట్టు

మైలవరం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్, లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 11న లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన కొల్లేరు గ్రూప్ సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. కొల్లేరు గ్రూపు నుంచి ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు. లీగ్ పద్ధతిలో నిర్వహించిన పోటీల్లో కృష్ణా, ఏలూరు, గోదావరి జట్లపై ఎన్టీఆర్ జిల్లా జట్టు విజయం సాధిం చి ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. ఎల్బీఆర్‌సీఈ కళాశాల డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీడీ రాజ్‌కుమార్, ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ జట్ల కోచ్‌లు పి.రవికుమార్, ఎమ్.సాయికిరణ్, బుజ్జి, కృష్ణా జిల్లా అసోసియేషన్ కార్యదర్శి సురేష్, ఏలూరు జిల్లా కార్యదర్శి జి.పవన్ పాల్గొన్నారు. కొల్లేరు గ్రూప్ విజేతలుగా నిలిచిన ఎన్టీఆర్ జిల్లా జట్టు ఈనెల 16, 17 తేదీల్లో వైజాగ్‌లో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటుందని కోచ్‌లు తెలిపారు.



పోరంకిలో జాబ్‌మేళాను ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కృషి, పట్టుదలతో విజయం తథ్యం : ఎమ్మెల్యే బోడె

పెనమలూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : క్రమశిక్షణతో కూడిన పట్టుదల, అంకితభావం ఉన్న వ్యక్తులే విజయం సాధించినట్లు చరిత్ర చెబుతోందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. పోరంకి విజ్ఞాన్ భారత్ పాఠశాలలో యువనేత బోడె వెంకట్రామ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువత విజయాలు సాధించాలంటే కఠిన నియమావళిని పాటించాలని సూచించారు. జాబ్‌మేళాలో 15 కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. కనీసం 80 శాతం మంది నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన చేసే విధంగా మార్గదర్శకాలను జారీ చేశామన్నారు. యువనేత బోడె వెంకట్రామ్ మాట్లాడుతూ జాబ్‌మేళాలో రిజిస్ట్రేషన్ చేసుకొన్న ప్రతి అభ్యర్థికీ ఎక్కడో ఒక చోట ఉద్యోగం లభించే విధంగా ఏర్పాటు చేశామన్నారు. జాబ్‌మేళాకు అనూహ్య స్పందన లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు మాట్లాడుతూ వినూత్న ఆలోచనలతో యువనేత వెంకట్రామ్ ఇలాంటి జాబ్ మేళాలు ఏర్పాటు చేయడం అతనికున్న దూరదృష్టికి నిదర్శనమన్నారు. తాడిగడప మునిసిపల్ కమీషనర్ షేక్ నజీర్, పాఠశాల డైరెక్టర్ శేషాద్రి, టీడీపీ నేతలు శొంఠి శివరాంప్రసాద్, కొండా ప్రవీణ్, రెహమాన్ పాల్గొన్నారు.

గన్నవరం విమానాశ్రయంలో నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులతో ఎయిర్‌పోర్టు డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి

గన్నవరం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో మంగళవారం నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. నటరాజ్ డ్యాన్స్ స్కూల్ చిన్నారులు స్వాతంత్ర్య ఫలాలు అందరికి అందాలంటూ ప్రదర్శన చేశారు. చిన్నారుల ప్రదర్శన ప్రయాణికులను ఆకట్టుకుంది. ఎయిర్‌పోర్టు డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి మాట్లాడుతూ విమానాశ్రయంలో చక్కటి సాంస్కృతిక ప్రదర్శన చేయటం అభినందనీయమన్నారు. చిన్నారులకు బహుమతులు అందజేశారు. నటరాజ్ డాన్స్ స్కూల్ మాస్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీలకు మేలు

గన్నవరం ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక లేమితో ఉన్నప్పటికీ సూపర్ సిక్స్ హామీలను అమలుకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గీత కార్మికులకు మద్యం షాపులు, బార్లలో 10 శాతం కేటాయించడంపై మంగళవారం టీడీపీ కార్యాలయంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు గూడపాటి తులసి మోహన్ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 340 షాపులను గీత కార్మికులకు కేటాయించడం హర్షణీయమన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే బీసీలకు అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. గీత కార్మికులకు కేటాయించిన షాపులను సద్వినియోగం చేసుకోవాలని, ఇతరులకు విక్రయించవద్దని సూచన చేశారు. టీడీపీ మండల కార్యదర్శి బోడపాటి రవికుమార్, ఎంపీటీసీ సభ్యుడు పడమట రంగారావు, కొండేటి కొండలరావు, పలగాని రాజబాబు, చిరుమామిళ్ల సూర్యం, దొంతు చిన్న, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ దయ్యాల రాజేశ్వరరావు, ఆళ్ల గోపాలకృష్ణ, మేడేపల్లి రమ, కొలుసు రవీంద్ర కుమార్, గొడ్డళ్ళ చిన్న రామారావు, మోర్ల నాగబాబు పాల్గొన్నారు. గాంధీబొమ్మ సెంటర్ నుంచి ఆగిరిపల్లి వైపు జరుగుతున్న రోడ్డు అభివృద్ధి పనులను మంగళవారం రాత్రి అధికారులతో కలసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పరిశీలించారు. పనులు మ రింత వేగవంతం చేయాలని ఆదేశించారు.



చంద్రబాబు, పవన్‌కల్యాణ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ



రికవరీ చేసిన ఫోన్లను యజమానులకు అందజేస్తున్న సీపీ ఎస్.వి.రాజశేఖరబాబు

సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిష్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

600 ఫోన్ల రికవరీ : సీపీ రాజశేఖరబాబు

విజయవాడ సిటీ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తులు అధైర్య పడకుండా అందుబాటులోని సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిష్టర్ (సీఐఆర్) సేవలను సద్వినియోగం చేసుకోవాలని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు సూచించారు. ఇటీవల కాలంలో చోరీకి గురైన రూ.70 లక్షలు విలువ చేసే 600 మొబైల్ ఫోన్‌లను రికవరీ చేసి, కమాండ్ కంట్రోల్ రూం వద్ద వాటి య జమానులకు మంగళవారం అందజేశారు. మొబైల్ చోరీకి గురైనా, పోగొట్టుకున్నా, సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేసి, సంబంధిత పత్రాలను సైబర్ పోలీసులకు అందజేయాలని సీపీ రాజశేఖరబాబు ప్రజలకు సూచించారు. సదరు వివరాలను సైబర్ పోలీసులు టీఎస్‌పీ (టెలికాం సర్వీస్ ప్రొవైడర్)కు అందజేస్తారన్నా రు. ఐఎంఈఐ నెంబర్ బ్లాక్ చేసిన తరువాత ఆ ఫోన్‌ను వాడుతున్న వ్యక్తి నుంచి రికవరీ చేయ డం జరగుతుందన్నారు. తాజాగా రికవరీ చేసిన 600 ఫోన్‌లలో ఏపీలోని వ్యక్తు ల నుంచి 504, ఒడిస్సా నుంచి 20, కర్ణాటక నుంచి 18, మహారాష్ట్ర నుంచి 16, రాజస్థాన్ నుంచి 13, ఉత్తరప్రదేశ్ నుంచి 12, బీహార్ నుంచి 10, పశ్చిమబెంగాల్ నుంచి ఏడు ఉన్నాయని వెల్లడించారు. డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి, ఏడీసీపీ ఎం.రాజారావ, సైబర్ క్రైం ఏసీపీ బి.రాజశేఖర్ పాల్గొన్నారు.



యూరియా కోసం నార్తువల్లూరు పీఏసీఎస్ వద్ద బారులు తీరిన రైతులు



మొవ్వ సొసైటీ వద్ద యూరియా కోసం వేచి ఉన్న రైతులు

అన్నదాతల ఆగ్రహావేశాలు

● పీఏసీఎస్‌లకు అరకొరగా యూరియా ● మొవ్వ, నార్తు వల్లూరు పీఏసీఎస్‌ల వద్ద రైతుల ఆందోళన

కూచిపూడి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం రైతులకు ఆగచాట్లు తప్పటం లేదు. ఎరువుల దుకాణదారులు బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నా చర్యలు తీసుకోవడం లేదు. సబ్సిడీ రేటుకు దొరుకుతుందని సొసైటీలకు వెళ్తే అరకొరగా అందజేస్తున్నారని, కొన్ని సొసైటీల ద్వారానే విక్రయాలు జరిపి అది కూడా సంఘ పరిధిలోని రైతులకు మాత్రమే అమ్మకా లు చేస్తుంటే మిగిలిన రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. మొవ్వ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి యూరియా దిగుమతి అయిందని తెలియటంతో మంగళవారం రైతులు బారులు తీరారు. పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు వివరాలు రెండు రోజు ల ముందే సిబ్బంది నమోదు చేసుకున్నారు. ఎకరాకు అరకట్ట చొప్పున ఇచ్చేందుకు మంగళవారం శ్రీకారం చుట్టారు. యూరియా అరకొరగా అందించటంపై రైతు లు ఆగ్రహం వ్యక్తం చేశారు. నానో యూరియా కొంటేనే యూరియా అందిస్తామని సొసైటీల్లో సైతం మెలిక పెట్టడం ఎంత వరకు పద్ధతి అని రైతులు వాపోతున్నారు. నానో యూరియా లీటరు రూ.250లు, కూలీల ఖర్చు రూ.400లు కలపి రూ.650 అవ్వటం రైతులకు భారం కాదా? అని ప్రశ్నించారు. యూరియాతోపాటు డీఏపీ కూడా రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. మొవ్వపాలెం సొసైటీకి 15 రోజుల నుంచి యూరియా అందుబాటులో లేకపోవటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం రెండో కోటాగా వేయాల్సి ఉండగా, నేటి వరకు ఒక్క కోట కూడా వేయలేదని గూడపాడు గ్రామానికి చెందిన రైతులు అధికారుల ఎదుట వాపోయారు. మొవ్వ సొసైటీకి వచ్చిన యూరియాను సొసైటీ పరిధిలోని రైతులకు మాత్రమే అందించాలని రైతులు ఏడీఏ శ్యామల దృష్టికి తీసుకొచ్చారు. ఎరువుల దుకాణదారులు బ్లాక్ మార్కెట్‌లో బస్తా రూ.450లకు విక్రయాలు జరుపుతున్నట్లు రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

రైతులు ఆందోళన చెందవద్దు : ఏడీఏ శ్యామల

యూరియా కొరత ఉన్నందున రైతుల అవసరాలకు మించి నిల్వ ఉంచుకోవద్దని ఏడీఏ శ్యామల, ఏవో సురేష్ బాబు నాయక్ అన్నారు. మంగళవారం దగ్గరుండి యూరియా పంపిణీకి శ్రీకారం చుట్టారు. మండల పరిధిలోని పలు సొసైటీలకు యూరియా అందుబాటులో ఉంచామని, ఎకరాకు అరకట్ట అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. అధిక ధరకు విక్రయించే దుకాణదారులపై రైతులు ఫిర్యాదు చేస్తే చర్యలు చేపడతామన్నారు.

నార్తువల్లూరులో గోడౌన్‌కు తాళాలు వేసి వెళ్లిపోయిన సిబ్బంది

తోట్లవల్లూరు : నార్తువల్లూరు పీఏసీఎస్ వద్ద మంగళవారం యూరియా కోసం రైతులు నానా ఇక్కట్లకు గురయ్యారు. ఉదయం 6 గంటలకు ఆధార్ కార్డులు చేతపట్టుకుని యూరియా కోసం రైతులు పీఏసీఎస్ వద్ద బారులు తీరారు. అదే సమయంలో 20 టన్నుల యూరియా లోడుతో లారీ వచ్చింది. యూరియా వచ్చిందని తెలియటంతో రైతులు భారీగా చేరుకున్నారు. యూరియా గోడౌన్‌లోకి దింపిన తరువాత సిబ్బంది విక్రయాలు చేపట్టటంతో రైతులు ఒక్కసారిగా దూసుకువచ్చారు. దాంతో సిబ్బంది పోలీసులను రప్పించారు. ఐదుగురు పోలీసులు వచ్చినా రైతుల తాకిడి పెరిగిపోవటంతో యూరియా ఇవ్వటం సాధ్యపడదని సిబ్బంది చేతులెత్తేశారు. సిబ్బంది గోడౌన్ తలుపు మూసేయడంతో రైతులు ఆగ్రహావేశాలకు గురయ్యారు. తిండి, నీళ్లు కూడా లేకుండా నిలబడితే 11 గంటలకు మూసేసి రేపు రమ్మంటే ఎలా అని, కూలి పనులు మానుకుని వచ్చామని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పది మందికి మాత్రమే యూరయా ఇవ్వగలిగారు.



మాట్లాడుతున్న నటి అనుపమా పరమేశ్వరన్

ఎంతో కష్టపడి నటించా

● నటి అనుపమా పరమేశ్వరన్

● బెజవాడలో పరదా యూనిట్ సందడి

సత్యనారాయణపురం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ నగరంలో పరదా చిత్రం యూనిట్ మంగళవారం సందడి చేసింది. ప్రమోషన్‌లో భాగంగా సత్యనారాయణపురంలోని అలీఖా బాంకెట్ హాల్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశా రు. హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ, తాను చాలా కష్టపడి చేశానంటూ కంటతడి పెట్టుకుంది. లేడీ ఓరియంటెడ్ పాత్రలో మొదటిసారిగా నటించినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ చిత్రాన్ని థియేటర్లకు వచ్చి చూడాలని కోరారు. పరదా కథ వినగానే చాలా ఎమోషనల్ అయ్యానని, నటించేటప్పుడూ అంతే ఎమోషనల్ అయ్యానని తెలిపారు. ప్రతి హీరోయిన్ ఇలాంటి క్యారెక్టర్ కావాలని కోరుకుంటుందన్నారు. దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగుల మాట్లాడుతూ పరదా చిత్రం ట్రైలర్‌కి ఇప్పటికే విశేష స్పందన లభించిందన్నారు. పరదా చిత్రానికి రామ్‌చరణ్ ట్రైలర్ లాంచ్ చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి మనిషికి మాస్క్ ఉంటుందని, దాన్ని తొలగిస్తే మనిషి జీవితం ఎలా ఉంటుందో, ఈ చిత్రం అలా ఉంటుందని వివరించారు. ముగ్గురు హీరోయిన్లతో ఈ చిత్రం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కథ రాసుకున్నప్పుడే అనుపమ పరమేశ్వరన్ మా త్రమే ఈ క్యారెక్టర్ కి న్యాయం చేయగలరని నమ్మినట్లు చెప్పారు. ఈ చిత్రం లో రాజేంద్రప్రసాద్, గౌతమ్ మీనన్ ముఖ్యపాత్రలు పోషించారని వివరించారు.

నందిగామ మున్సిపల్ కమిషనర్‌పై వైసీపీ నాయకుల దాడి

● ఖాళీ పేపర్లపై సంతకాలు

● పోలీసులకు ఫిర్యాదు

నందిగామ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నాయకులు తనపై దాడికి దిగారని నందిగామ మున్సిపల్ కమిషనర్ లోవరాజు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల మెయిన్ బజారులోని వైఎస్సార్ విగ్రహాన్ని కౌన్సిల్ ఆమోదంతో తొలగించడం జరిగిందన్నారు. మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్‌రావు ఆధ్వర్యంలో సోమవారం 17 మంది వైసీపీ నాయకులు తన చాంబర్‌లోకి చొచ్చుకొచ్చారని తెలిపారు. వైఎస్ విగ్రహాన్ని తొలగిస్తావా? నీ అంతు చూస్తామం టూ బెదిరించి, తనతో ఖాళీ పేపర్‌పై సంతకాలు చేయించుకున్నారని, తన సిబ్బందిని దుర్భాషలాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. యాకుబ్ ఆలీ, షేక్ మస్తాన్, పాములపాటి కిరణ్, ఆవుల విజయ్, కొరుసు కొండ, షేక్ సుభాని, తెలగా సత్యనారాయణ, షేక్ మున్నా, బెజవాడ రాజశేఖర్, బెజవాడ కార్తీక్, ముచ్చల శ్రీను, అనుమోలు పార్థ, నల్లమల్లి మురళి, షేక్ బాజీ, బొలినేని శ్రీనివాస్ తదితరులు తనతో సంతకాలు చేయించుకున్న ఖాళీ పేపర్‌ను తనకు ఇవ్వాలని కోరారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వై.వి.ఎల్.నాయుడు తెలిపారు.

స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పదవి రద్దు

● దరఖాస్తుల ఆహ్వానం

విజయవాడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలో ప్రస్తుతం ఉన్న స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ(ఎస్‌జీఎఫ్‌ఓఎస్) పదవిని రద్దు చేస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు ఓ ప్రకటనలో తెలిపారు. రాబోయే రెండేళ్లకు(2025-26, 2026-27) అండర్-14, 17 విభాగాల్లో ఆర్గనైజింగ్ సెక్రటరీ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆయన తెలిపారు. జిల్లా ప్రభుత్వ పాఠశాల, జిల్లా పరిషత్, మున్సిపల్ యాజమాన్యంలో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్స్(ఫిజికల్ ఎడ్యుకేషన్/పీఈటీలు) ఈ నెల 20 లోగా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. జిల్లా స్కూల్‌గేమ్స్ సెక్రటరీలుగా పనిచేసిన, ప్రస్తు తం చేస్తున్న స్కూలు అసిస్టెంట్లు, పీఈటీలు, జూనియర్ లెక్చరర్లు(పీఈటీ విభాగం) కూడా కొత్త నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవచ్చని డీఈవో తెలిపారు. అభ్యర్థులకు కచ్చితంగా కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలని, అమరావతిలోని స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ పోస్టుకు ఎంపికైన అభ్యర్థికి వెంటనే పాత పోస్టు రద్దవుతుందన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో సం బంధిత అధికారి నుంచి క్రమశిక్షణ చర్యలు ఎదుర్కొన్న వారు అనర్హులని ఆయన తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఆసక్తి ఉంటే పూర్తి వివరాలు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడి అనుమతితో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి సమర్పించాలన్నారు.

నాగుల్‌మీరా, మరుపిళ్ల, రమణారావులకు అభినందనలు

● ఎమ్మెల్యే సుజనాచౌదరి

విద్యాధరపురం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వివిధ కార్పొరేషన్లకు చైర్మన్‌లుగా నియమితులైన వారు తమ పదవులను బాధ్యతగా భావించాలని విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి మంగళవారం ట్విట్టర్ వేదికగా పేర్కొన్నారు. ఏపీ రాష్ట్ర నూర్ బాషా, దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ కె.నాగుల్ మీరా, ఏపీ నగరాల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా మరుపిళ్ల తిరుమలేశ్వరరావు, ఏపీ నాగవంశం సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ యర్రబోతు రమణరావులకు ఆయన అభినందనలు తెలియజేశారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 500

ఘనంగా లక్ష్మీగణపతి హోమం

గుడివాడ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : సంకటహర చతుర్థి సందర్భంగా స్థానిక మెయిన్‌రోడ్డులో వేంచేసియున్న విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం శ్రీలక్ష్మీగణపతి హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ హోమంలో 137మంది దంపతులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం హోమగుండంలో పూర్ణాహుతిని సమర్పించారు. ఈ నెల 27వ తేదీ నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు దేవస్థానంలో గణపతి నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్టు దేవస్థాన ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ సాయన రాజేష్, కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, పాల్గొన్నారు.


హోమంలో పాల్గొన్న ఉత్సవ కమిటీ సభ్యులు

రైతులకు యూరియా కష్టాలు

- యూరియా అందక రైతుల ఇబ్బందులు
- బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరకు విక్రయాలు
- గుళికలు కొంటేనే యూరియా అంటూ మెలిక

(ఆంధ్రజ్యోతి - కూచిపూడి): యూరియా కొరత రైతులను ఇబ్బందులకు గురి చేస్తుంది. ఎరువుల దుకాణాలతో పాటు సొసైటీల్లోనూ యూరియా కొరత ఉండటంతో రైతులు అవస్థలు పడుతున్నారు. 45 కేజీల యూరియా ధర రూ.266లు ఉండగా, బ్లాక్ మార్కెట్‌లో రూ.350 నుంచి రూ.400ల వరకు దుకాణదారులు అమ్మకాలు చేస్తున్నట్టు రైతులు వాపోతున్నారు. గుళికలు కొంటేనే యూరియా అమ్ముతామంటూ వారు షరతులు విధిస్తుండటం వల్ల రైతులు అయోమయానికి గురవుతున్నారు. దీంతో అవసరం లేకున్నా 4కిలోల గుళికలు రూ.700ల ధర పెట్టి యూరియా కోసం కొనుగోలు చేయటం రైతులను మరింత కలవరపెడుతుంది. మార్క్‌ఫెడ్ ద్వారా సొసైటీలకు దిగుమతి అయ్యే ఎరువులు రైతులకు అందకుండా రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో పక్కదారి పడుతున్నట్లు సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. డీఏపీ ఎరువు సైతం కొరతగా ఉందని రైతులు పేర్కొంటున్నారు.

యూరియా అందక ఇబ్బందులు పడుతున్నాం



సొంతపొలం, కౌలు పొలం కలిపి 70 ఎకరాల వరకు సాగు చేస్తున్నాను. యూరియా అందక నేడు ఇబ్బందులు పడుతున్నాను. ఎరువుల దుకాణదారులు బ్లాక్ మార్కెట్‌లో రూ.150ల వరకు అదనంగా ధరలు కల్పించి అమ్మకాలు చేస్తున్నారు. బ్లాక్ మార్కెట్ విక్రయాలు జరిపే వారిపై చర్యలు చేపట్టాలి.

గొట్టిపాటి శివరామ ప్రసాద్, రైతు


కూచిపూడిలో ఎరువుల కోసం ఎదరు చూస్తున్న రైతులు

పీఏసీఎస్‌ల్లో యూరియా నో స్టాక్

మొవ్వలోని 9 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉండగా, చినముత్తేవి, మొవ్వ, మొవ్వపాలెం, కోసూరు, కాజ, అయ్యంకి సంఘాలు మాత్రం ఎరువులు అమ్మటానికి లైసెన్స్‌లు ఉండగా, ఈ సంఘాల్లో ప్రస్తుతం యూరియా ఒక్క బస్తా కూడా లేకపోవటం విశేషం.

గుళికలు కొంటేనే యూరియా అమ్మకాలు



గుళికలు కొంటేనే యూరియా అమ్ముతామని ఎరువుల దుకాణదారులు మెళిక పెడుతున్నారు. సొసైటీల్లోనూ యూరియా కొరత ఉంది. ప్రస్తుత తరుణంలో రైతులకు పూర్తిగా యూరియా అవసరం ఉంది.

యద్దనపూడి రాగశేఖర్

బ్లాక్ మార్కెట్‌లో విక్రయాలు

ఎరువుల దుకాణదారులు కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్‌లో బస్తా రూ.400ల వరకు విక్రయాలు జరుపుతున్నారు. రాత్రివేళల్లో విచ్చలవిడిగా అధిక ధరలకు యూరియా విక్రయాలు జరుపుతున్నా అధికారులు ఏలాంటి చర్యలు తీసుకోవటం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి బ్లాక్ మార్కెట్‌లో విక్రయాలు అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

యూరియా అందుబాటులోకి తెస్తాం

యూరియా కొరత భయంతో రైతుల అవసరాలకు మించి యూరియా నిల్వ ఉంచుకుంటున్నారు. రెండు, మూడు రోజుల్లో యూరియా రైతులకు బయట మార్కెట్ తోపాటు సొసైటీల ద్వారా అందుబాటులోకి తెస్తాం.

సురేష్‌బాబు నాయక్, ఏవో

సొసైటీ అధ్యక్షుల నియామకం ఏకగ్రీవం

నందివాడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న సొసైటీ అధ్యక్షులు ఏకగ్రీవంగా 9 సొసైటీలకు గాను ప్రభుత్వం త్రీమెన్ కమిటీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రుద్రపాకకు మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, పొలుకొండకు పర్వతనేని బసవ వెంకట విజయప్రసాద్, చినలింగాలకు కొలకలేటి భవానీ ప్రసాద్, ఇలపర్రుకు సుంకర శ్రీనివాసరావు, జనార్ధనపురానికి కొల్లారెడ్డి శివనారాయణ స్వామిరెడ్డి, కుదరవల్లికి అల్లాడ చంద్రమౌళి, పెదవిరివాడకు మావులేటి ముకేష్, తమిరిశకు తోట ధర్మారావు, వెన్ననపూడికి సూరపనేని నాగేశ్వరరావులను చైర్మన్లుగా నియమించారు. .

రక్తదానం

గుడివాడ : స్థానిక ప్రాంతీయ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ముబారక్ సెంటర్‌కు చెందిన గౌసియా బేగంకు అత్యవసరంగా రక్తం అవసరమవడంతో కొనకళ్ల సీతయ్య ట్రస్ట్ సభ్యులు పెయ్యల శివ స్పందించి మంగళవారం రక్తమందించారు. రక్తదాత శివను ట్రస్ట్ అధ్యక్షుడు కొనకళ్ల సీతయ్య, పలువురు అభినందించారు.

మరమ్మతు పనుల ప్రారంభం

పమిడిముక్కల : కృష్ణాపురం- ఐనపూరు రోడ్డులో కూడేరు క్రాస్ రోడ్డు నుంచి ప్రారంభించిన రోడ్డు మరమ్మతు పనులను టీడీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పర్యటించినప్పుడు ఐనపూరు, ఐలూరు, కృష్ణాపురం ప్రజలు రోడ్డు దుస్థితిని ఆయన దృష్టికి తీసుకురాగా తాత్కాలిక మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్న హామీనీ కూడేరు క్రాస్ రోడ్డు నుంచి ఐనపూరు వరకు కొందరు దాతల సహకారంతో పనులు ప్రారంభించామన్నారు.

అసభ్య ప్రవర్తనపై పోక్సో కేసు

గుడివాడ రూరల్ : గుడివాడ తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసముంటున్న 10 ఏళ్ల బాలిక తన స్నేహితులతో కలసి స్థానిక ప్రభుత్వ పాఠశాల నుంచి 11వ తేదీ సాయంత్రం 3.30 గంటల సమయంలో పాఠశాల నుంచి తిరిగి వస్తుంది. మార్గ మధ్యలో అదే గ్రామానికి చెందిన 45 ఏళ్ల వయస్సు గల వ్యక్తి తన ఇంటిలో పూలు కోసుకోమని పిలిచి ఆమె పూలు కోసుకుంటుండగా, నిందితుడు బాలికను చేతులతో అసభ్యంగా తాకగా, బాలిక భయంతో ఇంటికి పారిపోయి సదరు విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేసింది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్సై నంబూరి చంటిబాబు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వేణుగోపాలస్వామి దేవస్థాన పాలకమండలికి దరఖాస్తుల ఆహ్వానం

తోట్లవల్లూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానం ధర్మకర్తల కమిటీ నియామకానికి ఆసక్తి గల వారు 20 రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని కార్యనిర్వాహణాధికారి సీహెచ్ హరి దుర్గా నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పాలిటెక్నిక్ ఇంజనీరింగ్‌లో టాపర్స్‌కి అవార్డులు నేడు

గుడ్లవల్లేరు : రాష్ట్ర ప్రభుత్వం డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వారిచే నిర్వహిస్తున్న వల్లూరుపల్లి వెంకట రామ శేషాద్రిరావు మెమోరియల్ అవార్డులు 17వ వార్షిక అవార్డుల ప్రధానోత్సవం బుధవారం గుడ్లవల్లేరు ఏఏఎస్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ వేదికగా నిర్వహించనున్నామని పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. పాలిటెక్నిక్ ఇంజనీరింగ్‌లో టాపర్స్‌కి ఈ అవార్డులను ప్రధానం చేస్తారని ఆయన తెలిపారు. అవార్డులను స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ శాఖ సెక్రటరీ జి.వి.వి సత్యనారాయణమూర్తి ప్రధానం చేయనున్నారన్నారు. వల్లూరుపల్లి వెంకట రామ శేషాద్రిరావు మెమోరియల్ స్టేట్ టాపర్ అవార్డును, సెల్ఫ్ ఫైనాన్సింగ్ పాలిటెక్నిక్‌ల్లో స్టేట్ టాపర్ అవార్డులను 99.52 శాతంతో గుడ్లవల్లేరు ఏఏఎస్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ విద్యార్థిని అల్లూరి లలిత కోమలి కైవశం చేసుకొందన్నారు. వల్లూరుపల్లి వెంకట రామ శేషాద్రిరావు మెమోరియల్ సెల్ఫ్ ఫైనాన్సింగ్ పాలిటెక్నిక్‌ల్లో స్టేట్ సెకండ్ టాపర్ అవార్డును 98.95 శాతం మార్కులు సాధించి వాసవీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థిని అఖిలాదేవి కైవశం చేసుకొన్నారు. వీరికి అవార్డుల ప్రధానం చేయనున్నాయని ఆయన తెలిపారు.

రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలి

● ఏడీఏ ఎస్.కవిత

గుడివాడ రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రైతులందరికీ ఎరువులు సక్రమంగా పంపిణీ చేయనున్నామని వ్యవసాయ శాఖ ఏడీఏ ఎస్.కవిత అన్నారు. మంగళవారం వలివర్తిపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొలాలకు వెళ్లి రైతులకు తెగుళ్ల ఆశించకుండా ముందు జాగ్రత్తలు ఏలా తీసుకోవాలని రైతులకు వివరించారు. కలుపు నివారణ చర్యలు ఏ విధంగా తీసుకుంటే రైతులకు ప్రయోజనం కలుగుతుందో తెలియజేశారు. రసాయనిక ఎరువులు ఎక్కువగా వేయటం వల్ల పొలంలో ఎక్కువగా పురుగులు ఆశిస్తాయని తెలిపారు. రైతులు ఎరువులు కొరత ఉందని ఐదు కట్టలు కావాల్సిన వారు పది కట్టలు ఇంట్లోకి తెచ్చుకుని పెట్టుకోవటం సరికాదన్నారు. పేద రైతులకు సైతం అందాల్సి ఉందన్నారు. రైతులందరికీ సక్రమంగా ఎరువులు అందించటానికి సహకార సంఘాల ద్వారా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రైతుకు యూరియా సరఫరా చేయటానికి కృషి చేస్తామని తెలిపారు. గ్రామాల్లోని సొసైటీల ద్వారా క్రమపద్ధతిలో ఎరువులు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో బోలెం అనంతలక్ష్మి, మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు చింతా శ్రీనివాసరావు, రజనీ, అశోక్ , రైతులు, పాల్గొన్నారు.


వలివర్తిపాడులో రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ కవిత

యూపీ పాఠశాల్లోని రికార్డుల పరిశీలన

గుడివాడ రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలుపరుస్తున్న విద్యలో జరుగుతున్న మార్పులు, చేర్పులను ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు గమనించాలని ఎంఈవో-1 సీహెచ్.రజని అన్నారు. బొమ్ములూరు యూపీ పాఠశాలను మంగళవారం ఆమె తనిఖీ నిర్వహించారు. పాటశాల్లోని రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు ఎంత మంది ఉన్నారు, 1 నుంచి 8వ తరగతి వరకు ఏయే తరగతుల్లో ఎంతమంది విద్యార్థులు ఉన్నారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు వివరాలు అడిగారు. బొమ్ములూరు పాఠశాల ఉపాధ్యాయులందరూ చక్కగా బోధించటం పట్ల అభినందించారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధించటం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వంలో వచ్చిన మార్పులు గమనించి ప్రతి విద్యార్థికీ టెస్టులు జరుగుతున్న వ్యవహారం, బుక్ లెట్స్ తీసుకుని విద్యార్థులతో ఏ విధంగా ఎగ్జామ్ రాస్తున్నది, ఉపాధ్యాయులు ఏ విధంగా చెబుతున్నది తెలుసుకున్నారు. ప్రతీ విద్యార్థి చక్కటి విద్యనభ్యసిస్తున్నారని, బొమ్ములూరులో ఇంకా విద్యార్థుల శాతం పెంచాల్సి ఉందని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


బొమ్ములూరు యూపీ పాఠశాల రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో సీహెచ్ రజని

ఎరువుల కోసం రైతన్నల ఎదురుచూపులు

పామర్రు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌సాగుకు అవసరమైన యూరియా ఇతర కాంప్లెక్సు ఎరువులు కోసం మండల వ్యాప్తంగా రైతన్నలు ఎదురుచూపులు చూస్తున్నారు. మంగళవారం మండల పరిధిలోని పెదమద్దాలి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి 20 టన్నులు యూరియా, కాంప్లెక్సు ఎరువులు దిగుమతి అయ్యాయి. సమాచారం అందుకున్న గ్రామంలోని రైతులు ఉదయం నుంచే సంబంధిత గౌడౌన్ వద్దకు చేరుకుని పడిగాపులు కాశారు. కొందరు రైతులు అందుబాటులో ఉన్న వస్తువులతో క్యూ పెట్టి పీఏసీఎస్ సిబ్బంది కోసం వేచి ఉన్నారు. సిబ్బంది రైతుకు ఒక్కొక్క బస్తా చొప్పున యూరియా అందించేందుకు సిద్ధమయ్యారు. దీంతో రైతులు సిఫార్సులు ఉన్నవారికే ఎరువులు అందిస్తున్నారని ఆరోపిస్తూ కొందరు ఆగ్రహం వ్యక్తం చేశారు. నాట్లు వేసిన తమ పంటలకు ప్రస్తుతం ఎరువులు వేయడం ఎంతో అవసరమంటూ మండిపడ్డారు. తహసీల్దార్ జి.రవికాంత్, మండల వ్యవసాయాధికారిణి వి.శివనాగరాణిలు సొసై టి వద్దకు చేరుకుని రైతులకు సర్దిచెప్పడంతోపాటుగా పోలీస్ సిబ్బందిని ఏర్పాటుచేసి టోకెన్ పద్ధతిని అమలు చేశారు.


పెదమద్దాలి పీఏసీఎస్ వద్ద ఎరువుల కోసం ఎదురుచూస్తున్న రైతన్నలు

మహిళల భద్రతకు శక్తియాప్ ఉపయోగకరం

● టూటౌన్ సీఐ జె.ఆర్.కె హనీష్

గుడివాడ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : అత్యవసర పరిస్థితుల్లో మహిళల తక్షణ సహాయం పొందేందుకు శక్తి యాప్ ఎంతగానో ఉపయోగకరమని టూటౌన్ సీఐ జె.ఆర్.కె హనీష్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక నైజాంపేటలో శక్తి యాప్ ఉపయోగాలను మహిళలకు వివరిస్తూ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రాష్ట్ర పోలీస్ శాఖ విడుదలచేసిన హెల్ప్‌లైన్ నెంబర్లను వినియోగించుకోవాలన్నారు. పిల్లలు మొబైల్ వాడకాన్ని తగ్గించేలా తల్లిదండ్రులు పర్యవేక్షణ చేయాలని, సోషల్ మీడియా, గేమ్స్ అనుచిత కంటెంట్ నుంచి పిల్లలను రక్షించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనధికార లోన్ యాప్స్ ద్వారా అప్పులు తీసుకోవడం వల్ల మహిళలు ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురవుతున్న సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. శక్తి టీమ్ సభ్యులు మహిళలకు భద్రత, సాంకేతిక అవగాహన, కుటుంబ సంక్షేమం వంటి అంశాలపై వివరణ ఇచ్చారు. ఈ సదస్సులో శక్తి టీమ్ సభ్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న టూటౌన్ సీఐ హనీష్

వ్యవసాయ పరపతి సంఘ ఎన్నికలను జరపాలి : ఆర్‌సీపీ

గుడివాడ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం వ్యవసాయ పరపతి సంఘాలకు ఎన్నికలు జరపకుండా త్రీమెన్ కమిటీలను నియమించి చేతులు దులుపుకుందని, నేడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం వ్యవసాయపరపతి సంఘాలకు ఎన్నికలను నిర్వహించేందుకు భయపడుతోందని సీపీఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి ఆరోపించారు. మంగళవారం స్థానిక సుందరయ్యభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించకుండా త్రీమెన్ కమిటీ పేరుతో పార్టీ నాయకులను నామినేట్ చేసుకోవడం దారుణమైన ప్రక్రియ అని ఆరోపించారు. ఈ సమావేశంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యుడు రేపాని కొండ, బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఎరువులు అందించాలి : కైలే

పామర్రు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): దేశానికి వెన్నముకగా ఉన్న అన్నదాత సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని గ్రహించి అన్నదాతలకు అవసరమైన యూరియా కాంప్లెక్సు ఎరువులను పూర్తి స్థాయిలో వారికి అందించే విధంగా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని పామర్రు వైసీపీ మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులకు యూరియా కేటాయింపులో డిమాండ్‌కు సరిపడా సప్లై లేదని మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించి రైతులకు చాలీచాలకుండా అరకొర ఎరువులు అందిస్తూ చేతులు దులుపుకుందామనే దోరణికి స్వస్తి పలకాలన్నారు.

ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగరాలి

పమడిముక్కల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతిఇంటిపై జాతీయ పతాకం ఎగురవేసి దేశభక్తిని చాటాలని ఇంచార్జ్ ఎంపీడీవో గోలి రామకృష్ణ అన్నారు. వీరంకి లాకువద్ద మంగళవారం స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఉద్యోగులతో కలసి హర్ ఘర్ తిరంగా ప్రదర్శన నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో డి.వెంకటేశ్వరరావు, ఏపీఎం టి.వెంకటేశ్వరరావు, ఏపీవో లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

గుడివాడ : స్థానిక చౌదరిపేటలోని శిరీషా ఫౌండేషన్ ట్రస్ట్ వద్ద దివ్యాంగులతో కలిసి బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం తిరంగా యాత్ర నిర్వహించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంగడాల సతీష్, అధికార ప్రతినిధి వాసిరెడ్డి మనోజ్, లీలాకుమారి, పాల్గొన్నారు.


కపిలేశ్వరపురంలో ప్రదర్శనలో పాల్గొన్న ఉద్యోగులు

గుడ్లవల్లేరు :గుడ్లవల్లేరులో హర్ ఘర్‌కా తిరంగా ర్యాలీని నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులచే నిర్వహించిన ర్యాలీలో ఎంపీడీవో ఎండి ఇమ్రాన్, డిప్యూటీ ఎంపీడీవో అంజనాదేవి, పాల్గొన్నారు.


విద్యావలంటీర్లకు ఉల్లాస్‌పై శిక్షణ

పమిడిముక్కల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలో 100 శాతం అక్ష్యరాస్యత సాధించాలన్నది లక్ష్యమని ఇంచార్జ్ ఎంపీడీవో గోలి రామకృష్ణ అన్నారు. మండలపరిధిలో 250 మంది విద్యావలంటీర్లకు కపిలేశ్వరపురం పీహెచ్‌సీ ట్రైనింగ్ సెంటర్‌లో మంగళవారం ఉల్లాస్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 2,500 మందిని వయోజన విద్య నేర్చుకునేవారుగా గుర్తించి ప్రతి పదిమందికీ ఒక విద్యావలంటీర్ చొప్పున 250 మందిని ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నామన్నారు.

సంక్షేమ పథకాల అమలే లక్ష్యం

గుడివాడ రూరల్ : ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరే విధంగా వీఆర్వోలు, సచివాలయ రెవెన్యూ ఉద్యోగులు కృషి చేయాలని తహసీల్దార్ కిరణ్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ అంశాలపై తహసీల్దార్ అధ్యక్షతన వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది తదితరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు వీఆర్వోలు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని, మీ కోసంలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రతీ రెవెన్యూ అధికారి ఆయా గ్రామాల పరిధిలో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా, ప్రజల నుంచి అర్జీలు వచ్చినా వెంటనే కార్యాలయానికి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి రంగనాథన్ కృషి ఎనలేనిది


నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ కుమార్

గుడివాడ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాల అభివృద్ధికి రంగనాథన్ చేసినకృషి ఎనలేనిదని ఏఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.జె.ఎస్.కుమార్ పేర్కొన్నారు.జాతీయ గ్రంథపాలకుల దినోత్సవం సందర్భంగా ఏఎన్ఆర్ కళాశాలలో మంగళవారం రంగనాథన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

గుడివాడ రూరల్: గ్రంథాలయ పితామహుడు రంగనాథ్ జయంతి సందర్భంగా మంగళవారం చౌటపల్లి గ్రంథాలయంలో ఆటల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి రత్న చంద్రరావు పాల్గొన్నారు.

గుడివాడ : ఆదిత్య డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎస్.ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్ రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణే ధ్యేయం

● ఎంపీడీవో విష్ణుప్రసాద్

గుడివాడ రూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులు రాకుండా ప్రతి విద్యార్థికీ వైద్య సిబ్బంది ముందు జాగ్రత్తలు తీసుకోవటం మంచిదని ఎంపీడీవో విష్ణుప్రసాద్ అన్నారు. మంగళవారం చౌటపల్లి ఉన్నత పాఠశాల, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నులిపురుగుల మందులు వేశారు. డిప్యూటీ ఎంపీడీవో జి.శ్రీనివాస్, ఎంఈవో టి.బాలాజీ, కార్యదర్శి హరికృష్ణ, బి.శ్రీలక్ష్మి, పాల్గొన్నారు.

గుడివాడ : స్థానిక బాపూజీనగర్ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక 18వ వార్డు గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డేవిడ్ ట్విన్‌సన్, కమ్యూనిటీ ఆర్గనైజర్ రామారావు, ఎంఈవో సీహెచ్ రజని, పాల్గొన్నారు.

పెదపారుపూడి: బాలబాలికలంతా నులిపురుగుల నిర్మూలన మాత్రలు తీసుకుని శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పెదపారుపూడి ఎంపీడీవో జె.విమాదేవి అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వైద్య సిబ్బందితో కలసి పాల్గొని బాలబాలికలకు మాత్రలు వేశారు. డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీహెచ్ఈవోలు చంద్రశేఖర్, సచివాలయ ఏఎన్ఎం రమాదేవి, పాల్గొన్నారు.


నులిపురుగుల మాత్రలు వేస్తున్న విష్ణుప్రసాద్

పమిడిముక్కల : జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకుని మండలపరిధిలో పాఠశాలల విద్యార్థులకు మంగళవారం ఇంచార్జ్ ఎంపీడీవో గోలి రామకృష్ణ నులిపురుగుల నిర్మూలన మందులు పంపిణీ చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 505

బెల్టుషాపు తొలగించాలి

కోడూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): దింటిమెరకలో ప్రభుత్వ పాఠశాల, దేవాలయం సమీపంలో ఉన్న బెల్టుషాపును తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. మంగళవారం కోడూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇంచార్జి తహసీల్దార్ సౌజన్య కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు. వంతెన పక్కన, పాఠశాల సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించి బడ్డీ కొట్టును ఏర్పాటు చేసి బెల్టుషాపును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల, దేవాలయం సమీపంలో మద్యాన్ని విక్రయించరాదని హెచ్చరించినా పట్టించుకోవటం లేదన్నారు. కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, లంకే రవి, పొనమాల వెంకటేశ్వరరావు, లింగం వేణు, తిరుమలశెట్టి సుబ్బారావు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు బోట్లు పంపిణీ, అర్హత పత్రాలను అందిస్తున్న నాబార్డు డైరెక్టర్ ఏకే.సూద్

బోట్లు, వలల పంపిణీ

నాగాయలంక, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నాబార్డు అందిస్తున్న ఆర్థిక సహకారాలతో యానాదులు జీవన ప్రమాణాలను పెంపొందించుకోవాలని నాబార్డు డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏకే సూద్ కోరారు. ప్రజా ప్రగతి సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నాగాయలంకలోని ఫుడ్ కోర్టు ఆవరణలో సంగమేశ్వరం, కమ్మనమోలు, మర్రిపాలెం గ్రామాల్లోని ఐదుగురికి నూరుశాతం రాయితీతో రూ.13.25 లక్షల విలువ గల బోట్లు, వలలు, ఐస్ బాక్సులను అందజేశారు. కార్యక్రమానికి ప్రజాప్రగతి సేవా సంఘం అధ్యక్షుడు పరుచూరి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో నాబార్డు చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.ఆర్.గోపాల్, జనరల్ మేనేజర్ కె.వి.ఎస్.ప్రసాద్, పహడ్ సింగ్, ఎ.శ్యామ్ మనోహర్, కె.మిలింద్ పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ల్లో త్రిసభ్య కమిటీ సభ్యుల బాధ్యతల స్వీకరణ

కోడూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో త్రిసభ్య కమిటీ సభ్యులు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. కోడూరు పీఏసీఎస్ ఛైర్మన్‌గా పూతబోయిన కరుణకుమార్, సభ్యులుగా పూతబోయిన శ్రీనివాసరావు, మల్లా వెంకటేశ్వరరావు, బడేవారిపాలెం ఛైర్మన్‌గా మర్రె గంగయ్య, సభ్యులుగా గాదె భాస్కరరావు, నడకుదుటి రాజగోపాలరావు, లింగారెడ్డిపాలెం ఛైర్మన్‌గా కోట సుబ్బారావు, సభ్యులుగా నల్లూరి చిన్న బసవ శంకరరావు, ఉప్పల వెంకట కోటేశ్వరరావు, వి.కొత్తపాలెం ఛైర్మన్‌గా రేపల్లె పిచ్చేశ్వరరావు, సభ్యులుగా రేపల్లే నాగమల్లేశ్వరరావు, బాదర్ల నాగమల్లేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. విశ్వనాథపల్లి ఛైర్మన్‌గా తోట సాంబశివరావు (సాంబయ్య), సభ్యులుగా కైతేపల్లి పానకాలరావు, విశ్వనాథపల్లి వేణు, సాలెంపాలెం ఛైర్మన్‌గా కొప్పనాతి సత్యనారాయణ, సభ్యులుగా మెండు బ్రహ్మయ్య, కొక్కిలిగడ్డవరప్రసాద్, ఉల్లిపాలెం ఛైర్మన్‌గా బొలిశెట్టి విటల్‌రావు, సభ్యులుగా విశ్వనాథపల్లి ప్రభుదాస్, బడే శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు.

రక్షణ కల్పించాలని ఎస్పీకి ఫిర్యాదు

మోపిదేవి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మోపిదేవివార్పుకు చెందిన ఒంపుగాని సుబ్బారావు తన కుమారుడు ఇతరుల నుంచి రక్షణ కల్పించాలని ఎస్పీ ఆర్.గంగాధర్‌రావుకు జరిగిన మీకోసం కార్యక్రమంలో అర్జీని అందజేశారు. మంగళవారం ఉదయం వార్పు వద్ద సుబ్బారావు మాట్లాడుతూ 2016లో ప్రభుత్వం 2 సెంట్ల నివేశనా స్థలం మంజూరు చేసింది. భార్యాభర్తలు అనారోగ్యంతో వైద్యం, కుటుంబ ఖర్చుల కోసం స్థలాన్ని మోపిదేవికి చెందిన వ్యక్తికి అమ్ముకోవటం జరిగిందన్నారు. దాంతో తన కుమారుడైన శ్రీనివాసరావు, భార్య, అతని పిల్లలు డబ్బులు ఇవ్వమని బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేశాడు. డబ్బులు ఇవ్వని పక్షంలో మీ సంగతి చూస్తామని బెదిరిస్తున్నాడన్నారు.

నారాయణరావు నగర్ కాలనీలో సుపరిపాలనలో తొలి అడుగు

చల్లపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమం నారాయణరావు నగర్ కాలనీలో 67, 68 బూత్‌ల పరిధిలో మంగళవారం జరిగింది. టీడీపీ నాయకులు బొబ్బా గోవర్ధన్ స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. ఏఎంసీ ఛైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి మోర్ల శివ, యూనిట్ ఇన్‌ఛార్జిలు గుడివాక పుండరీకాక్షుడు, పఠాన్ జిలానీ, బూత్ ఇన్‌ఛార్జి అమీన్ బేగ్, ఏఎంసీ డైరెక్టర్ షేక్ ఇబ్రహీం, కోట సాయి, మేడికొండ రవిబాబు, హరీష్, బత్తుల సాయి పాల్గొన్నారు.

రైతులకు సరిపడ యూరియా అందించాలి

జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మకు సీపీఎం నేత వై.నరసింహారావు వినతి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రైతులకు సరిపడా యూరియాను అందజేయాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మకు సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ వరి పంట దుబ్బు చేసే సమయంలో యూరియా అవసరమన్నారు. ప్రణాళికా బద్ధంగా యూరియా సరఫరా లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉంగుటూరు, గుడ్లవల్లేరు, ఉయ్యూరు, మచిలీపట్నం, బంటుమిల్లి, మోపిదేవి, ఘంటసాల మండలాల్లో సొసైటీల దగ్గరకు వెళ్లిన రైతులు యూరియా కోసం ఆందోళనకు దిగుతున్నారన్నారు. ఎకరాకు 22 కిలోలు మాత్రమే ఇస్తున్నారన్నారు. ప్రైవేటు డీలర్లు యూరియాను బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని, యూరియా అక్రమనిల్వలపై విచారణ జరిపి రైతులకు యూరియా అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మకు వినతిపత్రం సమర్పించిన సీపీఎం జిల్లా కార్యదర్శి నరసింహారావు

పోలీసు పహారాతో యూరియా పంపిణీ

మోపిదేవి : పెదప్రోలు పీఏసీఎస్‌కు మార్క్‌ఫెడ్ ద్వారా వచ్చిన 440బస్తాల యూరియా పంపిణీ మండల వ్యవసాయ శాఖాధికారి కె.హెబ్సిబా ఆధ్వర్యంలో ప్రారంభించారు. రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. వ్యవసాయశాఖ అధికారిణి సమక్షంలో పోలీసులు రైతులతో మాట్లాడి మొదటి విడతగా యూరియా తీసుకున్న రైతులను నిలిపివేసి ఇప్పటి వరకు తీసుకోని రైతులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, మొబైల్ ఓటీపీ ద్వారా రైతులకు యూరియా అందించారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం

చల్లపల్లి : రైతులకు యూరియా సరఫరా చేయటంలో ప్రభుత్వం విఫలమైందని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ అన్నారు. వక్కలగడ్డలో మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, ప్రతి రైతుకు అవసరమైన యూరియాను ప్రభుత్వం సకాలంలో అందించలేకపోయిందన్నారు. ఎకరానికి బస్తా యూరియా అవసరముంటే అరబస్తా చొప్పున సరఫరా చేస్తున్నారని విమర్శించారు. ఎంత విస్తీర్ణంలో సాగు జరుగుతోంది, ఎంత యూరియా అవసరం అనే విషయం తెలిసికూడా నిర్లక్ష్యం చేయటం తగదన్నారు. రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ రాము, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ, రైతులు యూరియా కోసం సొసైటీల వద్దకు పలుమార్లు తిరగటంతో ఇబ్బందులు పడాల్సివస్తోందన్నారు.

యూరియా కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నాం: ఎమ్మెల్యే

అవనిగడ్డ : నియోజకవర్గంలో రైతులకు యూరియా కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 33,5.25 హెక్టార్లలో రైతులు వరి సాగు చేస్తున్నారని, ఇప్పటి వరకు 4,096.35 టన్నుల యూరియాను ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, ప్రైవేట్ దుకాణాలకు సరఫరా చేశామన్నారు. రైతులకు ఇంకా ఎంత యూరియా అవసరం ఉందో గుర్తించి తగినట్లుగా యూరియా అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. యూరియా పక్కదారి పక్కదారి పట్టకుండా అధికారులు చర్యలు చేపట్టాలని మండలి సూచించారు.

పులిగడ్డ వద్ద 75 వేల క్యూసెక్కుల వరద

అవనిగడ్డ రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో పులిగడ్డ ఆక్విడెక్ట్ వద్ద వరద నీరు ప్రవహిస్తుంది. మంగళవారం ఉదయం 75 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుందని, రెండు రోజులపాటు ఇలాగే ఉంటుందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఏలాంటి ఇబ్బంది లేదని, క్రమేపీ తగ్గుతుందని అధికారులు తెలిపారు.

ఆక్వా రైతులకు విద్యుత్ చార్జీలపై సబ్సిడీ ఇవ్వాలి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : నష్టాలను చవిచూస్తున్న ఆక్వా రైతులకు విద్యుత్ చార్జీలపై 50 శాతం ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వాలని ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మకు బీజేపీ సీనియర్ నాయకుడు రాజా వాసిరెడ్డి మనోజ్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. ఆక్వా రైతుల సమస్యలపై మంగళవారం ఆయన ఇన్‌చార్జి కలెక్టర్‌తో చర్చించారు. ఆక్వా రంగం కుదలేయిందని, తీవ్ర నష్టాలను ఎదుర్కొంటుందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు తదితదరులు పాల్గొన్నారు.



చెత్త రహిత నగరంగా మచిలీపట్నం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : చెత్త రహిత నగరంగా మచిలీపట్నంను తీర్చిదిద్దుతామని టీడీపీ కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము అన్నారు. రూ. 2 కోట్ల 30 లక్షలతో కొనుగోలు చేసిన రెండు కాంపాక్ట్ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగరాము మాట్లాడుతూ, మచిలీపట్నంలో వేల టన్నుల చెత్త వల్ల స్థానికులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యకు పరిష్కారం కోసం ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టిందన్నారు. మరకాని సమతాకీర్తి, దేవరపల్లి అనిత, అన్నం ఆనంద్, జనసేన కార్పొరేటర్ పినిశెట్టి చాయాదేవి కృతజ్ఞతలు తెలిపారు.



కొనలు తుంచి నాట్లు వేసుకోవాలి

ఘంటసాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వరి నాట్లు వేసే ముందు వాటి కొనలను తుంచి నాటుకోవాలని తద్వారా నారుమడి నుంచి ప్రధాన పొలానికి పురుగు వ్యాప్తిని అరికట్టవచ్చునని కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. మంగళవారం ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం వరిలో నైపుణ్యత ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో వరిలో ఆకుల అంచుల నుంచి పసుపు రంగు నీటి డాగు మచ్చలు ఏర్పడి ఆకుల అంచుల నుండి ఎండిపోతున్నాయని, నివారణకు పొటాష్ ఎరువులను మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో ఎకరానిక 20 - 25 కిలోలు వేసుకోవాలన్నారు. శాస్త్రవేత్తలు రేవతి, వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.

చల్లపలి : శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారుల సూచనల మేరకు ఎరువుల యాజమాన్య పద్ధతులు రైతులు పాటించి అనవసర ఖర్చులు తగ్గించుకోవాలని వ్యవసాయశాఖ అధికారి కె.మురళీకృష్ణ సూచించారు. పురిటిగడ్డ, నడకుదురు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వరి పంటలో ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. మొదట దఫాలో ఒక ఎకరాకు 25 కిలోల యూరియా, 25 కిలోల డీఏపీ, 20 కిలోల పొటాష్ చొప్పున చల్లుకోవాలన్నారు. పురిటిగడ్డ ఎంపీటీసీ సభ్యురాలు రాజులపాటి అంకమ్మ, వీఆర్వో బేబి, వీపీఏలు నాగబాబు, రేవతి తదితరులు పాల్గొన్నారు.



అంగన్వాడీల నిరసన

బంటుమిల్లి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): బంటుమిల్లి ఐసీడీఎస్ ఇచ్చిన ఫోన్లు సరిగా పనిచేయడం లేదంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీలు నిరసన తెలిపారు. పాతఫోన్లు సపోర్టు చేయడం లేదని వాటిని తీసుకుని 5జీబీ ఫోన్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ మాజేటి శివశ్రీనివాసరావు, ధనశ్రీ, గోపిలక్ష్మీ, కృష్ణవేణి, గీత, శ్రీదేవి, మేరిగీత, పార్వతీ, అజయ్ కుమారి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ సభ్యులు

సమస్యలు పరిష్కరించాలి

అవనిగడ్డ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీపీటీడీ (ఆర్టీసీ) నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు మంగళవారం అవనిగడ్డ డిపో గేటు వద్ద ధర్నా నిర్వహించారు. పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలని, ఐఆర్ ప్రకటించాలని, గవర్నర్‌పేట -2 డిపో స్థలాన్ని లులు సంస్థకు బదలాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రీజినల్ కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.రమేష్, డిపో అధ్యక్షుడు పి.బాలాజీ, కార్యదర్శి ఆళ్ల కుమార్, సంజీవరావు, రీజినల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగేశ్వరరావు, డిపో కోశాధికారి ఎన్.అంజనేయులు పాల్గొన్నారు.



నాగపుట్టలో పాలుపోస్తున్న మహేష్ కుమార్ గౌడ్

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ ప్రత్యేక పూజలు

మోపిదేవి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. బీసీ సంఘాల నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆలయానికి చేరుకుని మహేష్ కుమార్ గౌడ్‌కు ఆలయ అర్చకులు, ఆలయ అధికారులు స్వాగతం పలికారు .నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలుకగా, ఆలయ పర్యవేక్షకులు బొప్పన సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు ఆయనకు అందజేశారు. పీసీసీ సభ్యులు గిడుగు రుద్రరాజు తదితరులు పాల్గొన్నారు.



కృష్ణా విశ్వవిద్యాలయంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

ఆకట్టుకున్న హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా విశ్వవిద్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. 100 అడుగుల జాతీయ పతాకతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉపకులపతి కూన రాంజీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఉషా, రెక్టార్ బసవేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

●కలెక్టరేట్‌లో మంగళవారం హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో కె.చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

అవనిగడ్డ: హర్ ఘర్ తిరంగా ర్యాలీలో భాగంగా ఎంఈవో వనజ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి తోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ఇస్తున్నామని, అర్హులనుంచి ఈనెల 28లోగా డీఈవో కార్యాలయంకు దరఖాస్తు పంపాలని డీఈవో పి.వి.జె. రామారావు తెలిపారు. దరఖాస్తులను ఎంఈవోలు, డీవైఈవోలు, ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్స్ ద్వారా పంపాలన్నారు.



ధర్నా చౌక్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

ఆటో కార్మికుల ధర్నా

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నట్టు ప్రకటించడంతో మా జీవనోపాధి పోతుందని ఆటో కార్మికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మచిలీపట్నం కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జేసీ గీతాంజలి శర్మకు అందజేశారు. కార్యక్రమం లో జిల్లా కార్యదర్శి ఎం.పోలినాయుడు, దావీదు, వెంకటేశ్వరరావు, గిరిబాబు, పోతురాజు, కృష్ణ, ఎండి కరీముల్లా, అశోక్, కరీముల్లా, ఎండీ బాషా, బి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన

గూడూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఇంటి బయట, ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్య సిబ్బంది మంగళవారం గూడూరు మద్దాల దళితవాడలో ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ లింగం సులోచనా రాణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైద్య సిబ్బంది వర్షాకాలంలో వచ్చే డయేరియా, ఇతర వ్యాధులు ప్రబలకుండా కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ స్టాఫ్, హెల్త్ అసిస్టెంట్ ఎం.సుబ్రహ్మణ్యం, ఏఎన్ఎం అరుణదేవి, ఆశవర్కర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఆల్బెండా జోల్ మాత్రల పంపిణీ జరిగింది. మచిలీపట్నం చిలకలపూడి పాండురంగ హైస్కూల్‌లో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ప్రేమ్ చంద్, డాక్టర్ మాలిని తదితరులు పాల్గొన్నారు. **నాగాయలంక :** ఎదురుమొండి పీహెచ్‌సీ పరిధిలోని 19 అంగన్వాడీ కేంద్రాలు, 23 ప్రభుత్వ పాఠశాలల్లో అల్బెండాజోల్ మాత్రలు డాక్టర్ కె.రాజేశ్వరరావు పర్యవేక్షణలో పంపిణీచేశారు. కార్యక్రమంలో బి.రాజేంద్ర కుమార్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ కె.జగన్మోహనరావు, హెల్త్ అసిస్టెంట్ జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం బి.లలిత కుమారి పాల్గొన్నారు. **కోడూరు :** కోడూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి రాణి సంయుక్త స్వతంత్రపురంలో జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యఆరోగ్యశాఖ సీహెచ్‌వో లీల, హెల్త్ అసిస్టెంట్ తారక మస్తాన్ తదితరులు పాల్గొన్నారు. **మోపిదేవి :** పెదకళ్లేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ అర్షియా సుల్తానా పెదకళ్లేపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సామూహిక నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. గంటా ఉమా, బాబూరావు పాల్గొన్నారు.